# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :60 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 02-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## పూడికతీత పనుల్లో రక్షణ చర్యలు పాటించకపోతే చర్యలు

హైదరాబాద్, సివరేజి పూడికతీత పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని జలమండలి జీఎం ఎస్.హరిశంకర్ హెచ్చరించారు. ఎల్లారెడ్డి గూడా సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పూడికతీత పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మ్యాన్ హోల్స్‌లో పూడిక తీసేటప్పుడు సేఫ్టీ నిబంధనలు పాటించని జెట్టింగ్ మెషిన్ ఏజెన్సీకి రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ.. పూడికతీసే సమయంలో కార్మికులకు విధిగా హెల్మెట్, గ్లోవ్స్, షూస్, ఇతర పనిముట్లు ఇవ్వాలని ఆదేశించారు.నిబంధనలకు విరుద్ధంగా కార్మికులతో పనులు చేయిస్తే ఏజెన్సీ రద్దు చేస్తామని హెచ్చరించారు.పూడికతీత పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటి వరకు అన్ని ఏజెన్సీలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. మ్యాన్ హోల్స్ వద్ద చేపట్టిన పనుల్లో గతంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని సేఫ్టీ మెజర్స్ వంద శాతం పాటించాలని ఆదేశించామని తెలిపారు. జలమండలి ఎం డీ, డైరెక్టర్ ఆపరేషన్స్1, సీజీఎం పర్యవేక్షణలో పూడికతీత పనుల్లో సేఫ్టీ నిబంధనలు పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

## 'పహల్గాం' ఉగ్రవాదులు ఇప్పటికీ కశ్మీర్‌లోనే.. ఎన్ఐఏ వర్గాల అంచనా



జమ్ము కశ్మీర్: పహల్గాం దాడి జరిగి దాదాపు వారం కావస్తోంది. ఈ మారణహోమంలో 26 మంది అమాయక టూరిస్టులు అసువులు బాసారు. అయితే, ఈ దాడికి బాధ్యులైన ఉగ్రమూకల్లో కొందరు ఇప్పటికీ కశ్మీర్‌లోనే ఉండి ఉండొచ్చని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. కొందరు టెర్రరిస్టులు దక్షిణ కశ్మీర్‌లో దాగి ఉండొచ్చన్న విశ్వసనీయ సమాచారం తమకు ఉందని ఎన్ఐఏ వర్గాలు తెలిపాయి. పహల్గాం దాడి సమయంలో కొందరు ఉగ్రమూకలు హత్యాకాండకు దిగితే మరికొందరు ఈ దాడిలో పాల్గొనకుండా దూరంలో నిలబడి ఉండొచ్చని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. భద్రత దళాలు ఘటనా స్థలానికి వస్తే వారిపై దాడి చేసేందుకు వీలుగా ఈ వ్యూహం అనుసరించి ఉండొచ్చని భావిస్తున్నాయి. స్థానికులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా పహల్గాం ఉగ్రవాదులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఆహారంతో పాటు ఇతర నిత్యావసరాలను తమ వెంట తెచ్చుకున్నట్టు చెబుతున్నాయి. కశ్మీర్‌లో ఎక్కువకాలం పాటు కొనసాగేందుకు వీలుగా పక్కా ఏర్పాట్లతో వచ్చినట్టు అనుమానిస్తున్నాయి.నిఘా వర్గాల ప్రకారం, దాడికి వారం మునుపే ఉగ్రవాదులు పహల్గాం చుట్టుపక్కల ఉన్న మూడు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. తొలుత ఓ ఉగ్రవాది స్థానికంగా ఉన్న ఓ ఎమ్యూజ్‌మెంట్ పార్కును ఎంచుకున్నప్పటికీ, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండటం చూసి వెనక్కు తగ్గాడు. ఇక నిఘా వర్గాలకు చిక్కకుండా ఉండేందుకు టెర్రరిస్టులు అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలను వాడారు. ఈ పరికరాలకు సిమ్ అవసరం ఉండదు. వీటితో చిన్న సందేశాలను ఇతరులెవరూ గుర్తించేందుకు వీలులేకుండా ఎన్‌క్రిప్టెడ్‌గా పంపిచొచ్చు. దీంతో, ఆ సందేశాలపై అధికారులు నిఘా పెట్టలేకపోయారని తెలిసింది.ఏప్రిల్ 22న పట్టపగలు ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. బైసరన్ మైదానం చుట్టూ ఉన్న అడవుల్లో దాక్కున్న ఉగ్రవాదులు ఒక్కసారిగా బయటకొచ్చి అమాయకులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడికి ప్రతిచర్యగా భారత్ సింధూ నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఇటీవల పాక్ విమానాలకు భారత గగనతలాన్ని కూడా మూసేసింది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మంత్రులకు అమెరకా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో ఫోన్ చేశారు. ఉద్రిక్తతలు తగ్గించుకునేందుకు ప్రయత్నించాలని కోరారు.

## ఏ రాష్ట్రానికి.. ఆ రాష్ట్రం యూనిట్ గా కుల గణన చేయాలి



హైదరాబాద్,తెలంగాణలో కుల గణనపై ప్రభుత్వ ప్రకటన రాహుల్ గాంధీ నాయకత్వంలోని జోడో యాత్రలో చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ,సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు.ఆయన మాట్లాడుతూ, కుల గణన దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన విధానం గురించి ముఖ్యంగా వివరించారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు వెళ్లిన జోడో యాత్రలో కుల గణనపై స్పష్టమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. "కుల గణన చేయడానికి అధికారంలోకి వస్తేనే అవకాశం" అని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ మార్గనిర్దేశం ప్రకారం, తెలంగాణలో కుల గణనను సక్రమంగా నిర్వహి ంచి, దేశానికి ఒక మోడల్‌గా నిలిపింది.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని యూనిట్‌గా కుల గణన చేయడం అత్యంత అవసరం అని చెప్పారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం, వర్గం ఉందని ఆయన వివరించారు. ఆయన చేసిన సర్వే 8 పేజీల ప్రశ్నావళి ద్వారా రూపొందించబడింది. ఈ సర్వేలో ప్రైవసీ యాక్ట్‌ను కూడా అనుసరించామని, 95 వేల మంది ఎన్యూమరేటర్లను నియమించి, సర్వే మానిటరింగ్ కోసం సూపర్ వైజర్లు నియమించామని తెలిపారు. సర్వేలో 3 శాతం మంది పాల్గొనకపోవడం వల్ల తిరిగి వారికి అవకాశం ఇచ్చామనీ, తెలంగాణ మోడల్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.కేంద్రమంత్రి మోడీకి రేవంత్ రెడ్డి సలహా ఇచ్చారు. "కేబినెట్ మంత్రులతో ఒక కమిటీ ఏర్పాటు చేయండి. రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి, టర్మ్ ఆఫ్ రిఫరెన్స్‌ను రూపొందించండి," అని ఆయన పేర్కొన్నారు. అలాగే, కుల గణనను సమాజానికి ఎక్స్-రే లాంటిదిగా భావించారు, దీనికి సంబంధించిన ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటు చేయాలని రాహుల్ గాంధీ సూచించారు. "మేము 57 ప్రశ్నలు 8 పేజీల ప్రశ్నావళిలో రూపొందించాం. ప్రజల సమాచారాన్ని గోప్యంగా ఉంచాము. కేవలం ఆయా కులాల పర్సంటేజ్ మాత్రమే ఇచ్చాం," అని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రం దీనికి మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, కుల గణనకు ముందు వచ్చిన కేంద్రానికి అభినందనలు తెలిపారు.బీసీ (బ్యాక్‌వర్డ్ క్లాసెస్) ల కోసం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "కేంద్రం ఆలస్యంగా అయినా నిర్ణయం తీసుకుంది," అని ఆయన అన్నారు. బీజేపీ నాయకులకు, "మీరు 11 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకోలేదు?" అని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి, "కేంద్రం మమ్మల్ని రమ్మన్నా, వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. మా అనుభవాలను పంచుకునేందుకు మేము సిద్ధంగా ఉన్నాం," అని చెప్పారు. "బీసీ వర్గాలకు న్యాయం జరగాలి," అని ఆయన అన్నారు. "కేంద్రం చేసిన నిర్ణయానికి స్వాగతం. ప్రజల సంక్షేమం కోసం మేము ప్రతి ఒక్కరి వాదనను గౌరవిస్తాము. రాష్ట్రాన్ని యూనిట్‌గా కుల గణన చేయాలి," అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## రేవంత్ డీఎన్ఏలో కాంగ్రెస్ లేదు : లక్ష్మణ్



హైదరాబాద్,సీఎం రేవంత్ రెడ్డి డీఎన్ఏలో కాంగ్రెస్ లేదని బీజేపీ రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కేంద్రం చేపట్టబోతున్న కులగణనపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కులగణనకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో వ్యతిరేకమన్నారు. ఆ పార్టీ గురించి రేవంత్ ఇంకా చాలా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఓబీసీలపై రాహుల్, రేవంత్‌లు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. ఓట్ల కోసమే తెలంగాణలో సర్వే చేపట్టారని ధ్వజమెత్తారు. చేసిన సర్వే వివరాలను పబ్లిక్ డొమైన్ లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

ఎవరి ఒత్తిడికి తలొగ్గలేదు..

ప్రధాన మంత్రి ఎవరి ఒత్తిడికి తలొగ్గలేదని.. కంటితుడుపు చర్యగా తాము సర్వేలు చేయబోమని లక్ష్మణ్ అన్నారు. సామాజిక అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కులగణనను చేపట్టబోతోందన్నారు. ఇక జనగణనతో పాటు కులగణన చేపడుతున్నందుకు ఆయన ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ పరిణామంతో బడుగు, బలహీనవర్గాల అభివృద్ధిలో దూసుకెళ్తారని ఆకాంక్షించారు. శాస్త్రీయంగా కులగణన చేయాలని మోడీ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు ఏజెన్సీలతో సర్వే చేయించిందని, ఆ వివరాలను కూడా బహిర్గతం చేయలేదని ఆరోపించారు. ఆ సర్వే పేరుతో కాంగ్రెస్ అక్షరాల రూ.5వేల కోట్లను దుర్వినియోగం చేసిందని ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు.

## శ్రామికులే లేకపోతే దేశ నిర్మాణం లేదు



అమరావతి,శ్రామికులే లేకపోతే దేశ నిర్మాణం లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. మేడే సందర్భంగా శ్రామికులతో పవన్‌కల్యాణ్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు."కార్మిక దినోత్సవం నుంచి కూలీలు కాదు ఉపాధి శ్రామికులు అని పిలుస్తాం. శ్రామికుల మాటలు వింటుంటూ ఎంతో ఆనందం కలిగింది. మేము కూడా నా చిన్నప్పుడు 3 ఎకరాలు అమ్ముకున్నాం. పాతికేళ్ల క్రితం 8 ఎకరాలు కొనుక్కున్నా. కండ కరిగించే వాళ్లు లేకపోతే గ్రీన్ రివల్యూషన్స్ రావు. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనేది చాలా అవసరం. శ్రామికులే లేకపోతే దేశ నిర్మాణం లేదు. ఓట్ల కోసం నేను ఏ పనీ చేయడం లేదు. మూగ జీవాలకు చేస్తే ఓటెయ్యావు. మాకు ఓటు గురించి ఆలోచన లేదు. ఏపీ పంచాయితీరాజ్ శాఖ కూడా దాహార్తి నుంచి మూగజీవాలను రక్షించడానికి పూనుకుంది." అని పవన్ కల్యాణ్ తెలిపా రు."పంచాయితీరాజ్ నిధులు ఇప్పుడు మన రాష్ట్రానికి ఆక్సిజన్ అయ్యాయి. గత ఆర్థిక సవత్సరంలో రూ.10,669 కోట్లు ఖర్చు చేశాం. వేతనాలకు రూ.6,190 కోట్లు.. మిగిలినది మెటీరియల్ కింద ఖర్చు చేశాం. పల్లె పండుగలో భాగంగా రూ.377.37 కోట్లతో 21,564 గోకులాలు పూర్తి చేశాం. 13,500 పశువుల తొట్టెలు రూ.60.75 కోట్లతో పూర్తి చేయడానికి కారణం శ్రామికులే. రూ.1800 కోట్లతో 36 వేల ఎస్సీ, ఎస్టీ, ఇతర కాలనీలలో రోడ్లు వేశాం. డోలీ తప్ప ఇంకేం లేని చోటికి కూడా అంబులెన్స్ వెళుతోంది. ఉపాధి శ్రామికుల సంక్షేమం మాకు చాలా ప్రాధాన్యం. ఉపాధి శ్రామికుడు పని ప్రదేశంలో మరణిస్తే చెల్లించే రూ. 50 వేలు ఇప్పుడు రూ. 2 లక్షలకు పెంచాం. ఉపాధి శ్రామికులు ఎండాకాలం ఉదయం 11 లోపు పూర్తి చేయాలి. అవసరం అయితే సాయంత్రం 4 గంటల తర్వాత మళ్లీ చేయాలి. ఉపాధి శ్రామికులకు గ్రామాల్లో ఏఎన్ఎంల సేవలు, వైద్య సదుపాయం ఉంటుంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఉపాధి శ్రామికులకు రూ.3 లక్షల నుంచీ రూ.30 లక్షల ఉచిత ప్రమాద భీమా ఇవ్వడానికి ఎస్‌బీఐతో ఒప్పందం చేసుకున్నాం. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని మా ప్రభుత్వానికి ఉపాధి శ్రామికుల సంక్షేమం ధ్యేయం. పని చేసే వాళ్లు ముందుంటే దేశం వెనుకబడదు. పని చేసేవాళ్లకు అత్యధిక గౌరవం ఇవ్వాలి." అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

## వేవ్స్ సమ్మిట్ ను ప్రారంభించిన ప్రధాని మోదీ...



ముంబై : వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ -వేవ్స్ ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ మీడియా పవర్ హౌస్‌గా భారత దేశాన్ని సమున్నతంగా నిలిపేందుకు భారత ప్రభుత్వం 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తోంది.. నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. వేవ్స్ సమ్మిట్ 2025 (కనెక్టింగ్ క్రియేటర్స్, కనెక్టింగ్ కంట్రీస్) తో 100 కి పైగా దేశాల నుంచి కళాకారులు, సృష్టికర్తలు, పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలను ఒకే గొడుగు కిందకు వచ్చారని మోదీ అన్నారు.. ఈ సమ్మిట్ సృజనాత్మకత కేంద్రంగా అభివర్ణించారు

హాజరైన సినీ ప్రముఖులు..

ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్ , రణ్‌బీర్ కపూర్ , దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్. హేమ మాలిని, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి తదితరుల హాజరయ్యారు.కాగా, 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నాలుగు రోజుల పాటు కొనసాగనుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఇందులో మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు కానున్నారు.

## భారత్ ఔదార్యం.. అట్టారీ - వాఘా సరిహద్దు చెక్ పోస్ట్ తెరిచి ఉంచాలని నిర్ణయం

న్యూఢిల్లీ : భారత్‌లో నివసిస్తున్న పాకిస్థానీ పౌరులను వెనక్కి పంపే విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారిని దేశం విడిచి వెళ్లేందుకు విధించిన ఏప్రిల్ 30 గడువును సవరించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేంత వరకు పంజాబ్‌లోని అట్టారీ-వాఘా సరిహద్దు గుండా పాకిస్థానీయులు తమ స్వదేశానికి వెళ్లేందుకు అనుమతిని కొనసాగించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సరిహద్దు వద్ద చిక్కుకుపోయిన వందలాది మంది పాక్ పౌరులు, వారి కుటుంబ సభ్యులకు తాత్కాలికంగా ఊరట లభించినట్టు అయింది.పహల్గామ్ దాడి తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో భారత్‌లో ఉన్న పాకిస్థానీ పౌరులు ఏప్రిల్ 30లోగా దేశం విడిచి వెళ్లిపోవాలని గతంలో కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత సరిహద్దును మూసివేయనున్నట్టు ప్రకటించింది. ఈ ఆకస్మిక ఆదేశంతో అనేక కుటుంబాలు, ముఖ్యంగా భారతీయులను వివాహం చేసుకున్న పాక్ జాతీయులు, దీర్ఘకాలిక వీసాల కోసం ఎదురుచూస్తున్న వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తమను బలవంతంగా వేరు చేస్తున్నారని, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు వాపోయారు. భారతీయుడిని వివాహం చేసుకుని, వీసా మార్పు కోసం ఎదురుచూస్తున్న పాక్ జాతీయురాలు సమీరన్, "నా తప్పేంటి? మమ్మల్ని ఎందుకు శిక్షిస్తున్నారు?" అని ప్రశ్నించారు. వైద్య వీసాలు ఉన్నవారికి మొదట్లో మినహాయింపు ఇచ్చినా, ఇతర కేటగిరీలకు చెందిన అనేక మంది ఈ ఆదేశాల వల్ల ఇబ్బంది పడ్డారు. మానవతా దృక్పథంతో ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాజాగా కేంద్ర హోం శాఖ గడువును నిలిపివేయడంతో ప్రభావిత కుటుంబాలకు తాత్కాలిక ఉపశమనం లభించింది.

బస్సులో మరణించిన వృద్ధుడు..

ఈ గడువు కారణంగా అట్టారీ సరిహద్దు వద్ద తీవ్ర అనిశ్చితి, భావోద్వేగపూరిత వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. 1980 నుంచి భారత్‌లో నివసిస్తున్న 80ఏళ్ల పాకిస్థానీ పౌరుడు అబ్దుల్ వహీద్ భట్, తనను వెనక్కి పంపే ప్రక్రియ కోసం బస్సులో వేచి చూస్తుండగా మరణించారు. ఈ ఘటన బహిష్కరణ ప్రక్రియ వృద్ధులపై చూపుతున్న శారీరక, మానసిక ప్రభావాన్ని ఎత్తిచూపుతోంది.

సరిహద్దు దాటిన 786 మంది..



పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్ ను వీడి వెళ్లాలని పాక్ జాతీయులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో బుధవారం నాటికి మొత్తం 786 మంది వెళ్లిపోయారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8మంది పాకిస్థాన్ వీసాలున్న భారతీయులున్నారు. గడచిన 6 రోజుల్లో వారంతా అటారీ - వాఘా సరిహద్దు మీదుగా పాకిస్థాన్ కు వెళ్లిపోయారు. పాకిస్థాన్ నుంచి భారత్ కు 1,465 మంది వచ్చారు. వీరిలో 25మంది దౌత్యాధికారులు, అధికారులు, దీర్ఘకాల వీసాలున్న 151 మంది పాకిస్థాన్ జాతీయులున్నారు. ఈ వివరాలను బుధవారం అధికార వర్గాలు వెల్లడించాయి. తిరిగి వెళ్లడానికి ఇచ్చిన గడువు మంగళవారంతో ముగియడంతో కేంద్రం ఆదేశాల మేరకు అటారీ- వాఘా సరిహద్దును అధికారులు మూసివేశారు. అయితే సరిహద్దులు తెరిచి ఉంచాలని కేంద్రం ఆదేశాల రావడంతో తిరిగి నేటి ఉదయం నుంచి తెరిచారు.. యదావిధిగా ఈ సరిహద్దు నుంచి వీసా గడువు ముగిసిన వారు పాకిస్తాన్ కు వెళ్లవచ్చని పేర్కొంది.

### పాతపద్దతిలో విఐపి బ్రేక దర్శనాలు

తిరుమల, తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాల కొత్త షెడ్యూల్ గురువారం నుంచి అమల్లోకి వచ్చింది. గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు ఉదయం 5.30 గంటలకు మొదలై ఉదయం 11 గంటలకు ముగిసేవి. అయితే రాత్రి వేళల్లో కంపార్టుమెంట్లలో వేచి ఉండే భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించాలనే ఉద్దేశంతో గతంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను ఉదయం 10 గంటలకు మార్చారు. అయినప్పటికీ జనరల్ బ్రేక్ దర్శన భక్తులకు మాత్రం ఉదయం 8 గంటల నుంచి 10 గంటలోపు దర్శనం చేయిస్తున్నారు.

## మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోయేలా కృషి చేయాలి



హైదరాబాద్: మేడే సందర్భంగా కార్మికులకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల శ్రేయస్సు కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు.భౌగోళిక తెలంగాణ తెచ్చుకున్నప్పటికీ.. సామాజిక తెలంగాణ సాధించలేకపోయామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. మేడే సందర్భంగా కార్మికులకు కవిత శుభాకాంక్షలు తెలిపారు. ఇవాళ(గురువారం) తెలంగాణ భవన్‌లో కవిత మీడియాతో మాట్లాడారు. సామాజిక తెలంగాణ దిశగా భవిష్యత్తు అడుగులుండాలని చెప్పారు. మేడే స్ఫూర్తితో తెలంగాణలో అసమానతలు తొలగిపోవటానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు.రంగారెడ్డి జిల్లాలో తలసరి ఆదాయం రూ. 8లక్షలు ఉంటే.. వికారాబాద్‌లో లక్ష 58వేలు మాత్రమేనని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. పది కిలోమీటర్ల దూరంలోనే ఇంత వ్యత్యాసం ఉండటం ప్రమాదకరమని అన్నారు. అసమానతలు తొలగిపోవడానికి మేడే స్ఫూర్తి కావాలని చెప్పారు. రైతుబంధు కింద ఎకరం ఉంటే రూ.10 వేలు.. పది ఎకరాలుంటే లక్ష రూపాయలు ఇచ్చామని.. కానీ భూమి లేని కార్మికులకు ఏమీ చేయలేకపోయామని తెలిపారు. భవిష్యత్తులో భూమి ఉన్నా.. లేకున్నా ఎలా ఆదుకోవాలనే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. మే 20వ తేదీన దేశవ్యాప్తంగా తలపెట్టిన కార్మికుల సమ్మెకు జాగృతి మద్దతు ఇస్తోందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిది: జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: సొంత పార్టీ ఎమ్మెల్యేలే సీఎం రేవంత్‌రెడ్డి పేరు మరచిపోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి విమర్శలు చేశారు. ఇవాళ(గురువారం) సూర్యాపేట మునిసిపల్ ఆఫీస్ వద్ద మేడే జెండాను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఎగుర వేశారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఒక్క మంచి పని చేయని రేవంత్‌రెడ్డి పేరును ప్రజలు ఎందుకు గుర్తు పెట్టుకుంటారని జగదీష్‌రెడ్డి ప్రశ్నించారు.రేవంత్ వల్ల బాధించబడ్డ వారే ఆయనను ఓడిస్తారని జగదీష్‌రెడ్డి అన్నారు. ముమ్మాటికీ తెలంగాణకి కాంగ్రెసే విలన్ అని ఆక్షేపించారు. అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు.

## సంపాదకీయం

శుక్రవారం 02-05-2025

# ఆయుర్వేదంలోనూ ఏఐ ఆవిష్కరణలు!

ఆరోగ్యంగా జీవించేందుకు మనసును, దేహాన్ని సమన్వయపరిచే సమగ్ర జీవన విధానాన్ని ఆయుర్వేదం బోధిస్తుంది. ఇందులో మనసు, దేహం, పరిసరాల మధ్య సమతౌల్యం సాధించి, సహజ రీతిలో స్వస్థత చేకూర్చే ప్రయత్నం జరుగుతుంది. ఇప్పుడు ఆయుర్వేద విజ్ఞానానికి కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను జోడించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆరోగ్యంగా జీవించేందుకు మనసును, దేహాన్ని సమన్వయపరిచే సమగ్ర జీవన విధానాన్ని ఆయుర్వేదం బోధిస్తుంది. ఇందులో మనసు, దేహం, పరిసరాల మధ్య సమతౌల్యం సాధించి, సహజ రీతిలో స్వస్థత చేకూర్చే ప్రయత్నం జరుగుతుంది. ఇప్పుడు ఆయుర్వేద విజ్ఞానానికి కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను జోడించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.భారతీయ సమాజంలో ఇప్పటికీ ఆయుర్వేదం విస్తారంగా వినియోగంలో ఉంది. గత ఏడాది జరిగిన ఒక సర్వే ప్రకారం దేశంలో రిజిస్టర్ అయిన ఆయుర్వేద వైద్యులు 7.5 లక్షలకుపైగా ఉన్నారు. బోధన రంగంలో 884 యూజీ కాలేజీలు, 251 పీజీ కళాశాలలు ఉన్నాయి. మూడు వేలకుపైగా ఆసుపత్రులు, 36వేలకు పైగా క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. ఎన్ఐటీల తరహాలో జాతీయ ఆయుష్ సంస్థలను ఏర్పాటు చేశారు. ఆయుర్వేదంలో పరిశోధనా రంగం కూడా ఇటీవలి కాలంలో ఊపందుకుంటోంది. ఆయుర్వేదం బోధించే సంప్రదాయ పద్ధతులను నిర్ధారించేందుకు 40వేలకుపైగా శాస్త్రీయ అధ్యయనాలు జరిగాయి.

ఏఐ 'నాడీ తరంగిణి'

ఆధునిక వైద్యమైన అలోపతిని ఆయుర్వేదంతో పోల్చితే ఒక తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అలోపతిలో అడుగడుగునా రోగనిర్ధారణ పరీక్షలు, చికిత్సలో భారీ సాంకేతిక సాధనాల వాడకం కనిపిస్తుంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో కృత్రిమ మేధ (ఏఐ) ప్రవేశంతో ఆధునిక వైద్య రంగంలో చిన్నపాటి విప్లవమే చోటుచేసుకుందనడం అతిశయోక్తి కాదు. మూల సిద్ధాంతాల్లోనే రెండు సంప్రదాయాల మధ్య ఎంతో తేడా ఉండటంతో, అలోపతి స్థాయిలో ఆయుర్వేదంలో సాంకేతిక విధానాల ప్రయోగం, ప్రమేయం కనిపించదు. అయితే, ఇటీవలి కాలంలో ఈ విషయంలోనూ కొన్ని ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయుర్వేదంలోని ఎన్నో విభాగాల్లో ఏఐ పద్ధతులను ప్రవేశపెడుతూ ఎంతో ఉత్తేజకరమైన పరిశోధన జరుగుతోంది. ఆయుర్వేదంలో నాడీ పరీక్షకు ముఖ్యమైన స్థానం ఉంది. రోగి మణికట్టు దగ్గర రేడియల్ ఆర్టరీ మీదుగా సున్నితంగా నొక్కుతూ వైద్యులు నాడీ పరీక్ష చేస్తారు. నాడి లయలోని భేదాలను బట్టి ఎన్నో రకాల వ్యాధులను కనిపెట్టవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అయితే నాడీ పరీక్ష ఒక కళ. అనుభవజ్ఞులైన వైద్యులు ఏళ్లకొద్దీ అభ్యాసంతో నిష్ణాతులవుతారు. ఇప్పుడు ఆ నైపుణ్యం అందరికీ అందుబాటులో ఉండేలా ఆప్టికల్ సెన్సర్లతో నాడిని కొలిచే విధానం మొదలైంది. అలాంటి ఒక పరికరం పేరు 'నాడీ తరంగిణి.' ఆ ఉపకరణం అందించే సంకేతాలను ఏఐ పద్ధతులతో విశ్లేషించి రోగాలను నిర్ధారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాడీ తరంగిణి ఇచ్చే ఫలితాలు అనుభవజ్ఞుడైన వైద్యుడు చేసే నిర్ణయాలతో 87శాతందాకా సరిపోతున్నాయని ఆ పరికరాన్ని కనిపెట్టిన సాంకేతిక నిపుణులు అనిరుద్ధ జోషి చెబుతున్నారు. ఆయుర్వేద శాస్త్ర గ్రంథాల్లో వేలాది మూలికలు, వాటి రోగనివారణ లక్షణాలను అభివర్ణించారు. ఒకే రోగానికి వినియోగించే ఆయుర్వేద మూలికలు, అలోపతి మందుల మధ్య తులనాత్మక విశ్లేషణ చేస్తూ ఆయుర్వేద ఔషధాలను పరిశీలించడం ఒక బృహత్తర ప్రయత్నమే అవుతుంది. ఇందులో ఏఐలో భాగమైన నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌ను ఉపయోగించి, ఆయుర్వేద మూలికల వర్ణనను పరిశీలిస్తూ కొత్త మందుల ఆవిష్కరణలో వేగంగా పురోగమించడానికి వీలవుతోంది. ఇలా సాంకేతిక పద్ధతుల సాయంతో ఆయుర్వేదానికి, అలోపతికి మధ్య కొంత సాన్నిహిత్యాన్ని సాధించవచ్చు.

లోతైన సమన్వయం

ఆయుర్వేదానికి, ఆధునిక అలోపతికి మధ్య సంబంధాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆయుర్వేదంలోని మూల భావనలను ఆధునిక వైజ్ఞానిక దృక్పథంతో పరిశోధించాలి. ఆయుర్వేదంలో ఆరోగ్యాన్ని వాతం, పిత్తం, కఫం అనే మూడు తత్వాల (దోషాలు) పరంగా వర్ణిస్తారు. వీటిని నిక్కచ్చిగా, సంఖ్యాత్మకంగా ఆధునిక విజ్ఞాన తరహాలో చెయ్యడం అంత సులభం కాదు. అందుకు జీవశాస్త్ర పునాదులనూ పరిశీలించాల్సి ఉంటుంది. ఆధునిక జీవశాస్త్రం ప్రకారం ప్రతి జీవవ్యవస్థ 'సమాచారం, శక్తి, పదార్థం' అనే మూడు రాశుల నిరంతర ప్రవాహం వల్ల సుస్థిరంగా సాగుతుంటుంది. ఇప్పుడు సమాచారాన్ని వాతంతో, శక్తిని పిత్తంతో, కఫాన్ని పదార్థంతో ముడిపెడితే, ఆయుర్వేదంలోని మూల భావనలను ఆధునిక వైజ్ఞానిక దృష్టితో పరిశీలించడం సాధ్యమవుతుంది. ఈ రకమైన దృక్పథంతో ఆయుర్వేద సిద్ధాంతాలను కొత్తగా పరిశీలిస్తే, వాటిని వైజ్ఞానికంగా నిర్ధారించడానికి, అవసరమైన చోట్ల సవరించడానికి వీలవుతుంది. ఆయుర్వేదం అందించే సూచనలను అనుసరిస్తూ సాగితే, ఆధునిక జీవక్రియా శాస్త్రంలోనే కొత్త అంశాలు వెలుగు చూడవచ్చు. ఇలాంటి స్వచ్ఛమైన, సృజనాత్మక పరిశోధన కసరత్తులో ఆయుర్వేద వైద్యులు, అలోపతి డాక్టర్లు, ఆధునిక జీవ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు చేతులు కలపాలి. అలా సమన్వయ కృషి జరిపితే సమాజానికి గొప్ప మేలు కలుగుతుంది.

కట్టుతప్పుతున్న ఎగవేతలు

ఇంటి సరకులు, వస్తువుల కొనుగోళ్లు, వైద్యం తదితరాలకు క్రెడిట్ కార్డుల వాడకం కొన్నేళ్లుగా బాగా పెరిగింది. అవసరమైనప్పుడు ఖర్చు చేసి కొద్ది రోజుల తరవాత చెల్లించే అవకాశం ఉండటం క్రెడిట్ కార్డు సౌలభ్యం. ఈ క్రమంలో వాటిని పొందేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. చాలామంది దగ్గర ఒకటి కన్నా ఎక్కువ క్రెడిట్ కార్డులు ఉంటున్నాయి. వాటి ద్వారా ఖర్చుచేసిన మొత్తాన్ని చెల్లించకుండా కొందరు ఎగవేస్తున్నారు. దాంతో, నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) కట్టుతప్పుతున్నాయి. 2023తో పోలిస్తే నిరుడు అవి 28శాతం మేర పెరిగాయి. గత అయిదేళ్లలో క్రెడిట్ కార్డు ఎన్‌పీఏలు ఎలా పెరిగాయంటే...

# పదునైన వ్యూహంతో...



న్యూఢిల్లీ,ప్రతీకారం దిశగా ఒక్కో అడుగే పడుతోంది. పహల్గాం సమీపంలో వారం రోజుల క్రితం 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదుల వేటకు రంగం సిద్ధమవుతోంది. దాడి ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా జరగాలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను త్రివిధ దళాధిపతులకు ఇస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం తీసుకున్న నిర్ణయం అసాధారణమైనది. దాంతోపాటు జాతీయ భద్రతా సలహా బోర్డు(ఎన్ఎస్ఏబీ)ను బుధవారం పునర్వ్యవస్థీకరించటం కూడా కీలక పరిణామం. 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి సారథ్యంలో ఏర్పాటైన ఈ బోర్డు జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌కు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తుందంటున్నారు. పదునైన వ్యూహం, పక్కా ప్రణాళిక, మెరికల్లాంటి దళాలను కీలక ప్రాంతాల్లో మోహరించటం వగైరాలన్నీ ఇలాంటి సమయాల్లో అత్యంత అవసరం. ఇప్పటికే పహల్గాం మారణకాండను తక్కువ చేసి చూపటానికి పాకిస్తాన్ చేయాల్సిందంతా చేస్తోంది. దాదాపు 45 యేళ్లుగా దాని వ్యూహం ఇదే. ఒకపక్క ఎల్ఓసీలో వరసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ, సరిహద్దుల్లో నిఘా రాడార్లు, యుద్ధ సామగ్రి తరలిస్తూ మరోపక్క అమెరికా తదితర దేశాలముందు తన అమాయ కత్వాన్ని చాటుకోవటానికి ప్రయత్నిస్తోంది. మారణకాండ గురించి 'నమ్మదగ్గ సమాచారం' ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పటం ఇప్పటి షెహబాజ్ సర్కార్‌కి మాత్రమే కాదు... కుట్రపూరితంగానో, ఎన్నికల మాటున సైన్యం ప్రాపకంతోనో అధికారాన్ని చేజిక్కించుకుంటూ వస్తున్న పాక్ అధినేతలందరికీ అలవాటైన విద్య. దీనికి ఎక్కడో అక్కడ అడ్డుకట్ట పడటం తప్పనిసరి. అందుకే ప్రభుత్వ తాజా నిర్ణయం అన్నివిధాలా ఆహ్వానించదగ్గది. మన సహనాన్ని చేతగానితనంగా, మన సుహృద్భావాన్ని అశక్తతగా భావించటం పాకిస్తాన్‌కు అలవాటైంది. మొన్న జరిగిన మారణకాండ అనంతరం దేశవ్యాప్తంగా ప్రజలందరూ ప్రతీకారేచ్ఛతో రగులుతున్నారు. కేవలం దాన్ని సంతృప్తిపరచటమే అంతిమ లక్ష్యం కారాదు. తాజా దాడిలో పాకి స్తాన్ సైన్యంలో పారా కమాండోగా పనిచేసిన హాషీం మూసా అనే ఉగ్రవాది పాల్గొనటాన్నిబట్టి చూస్తే ఐఎస్ఐ పాత్రవుందని అర్థమవుతోంది. ఇలాంటివి నివారించాలంటే సరిహద్దుల్లో పటిష్టమైన నిఘావుండాలి. దాంతోపాటు వేర్వేరు సమయాల్లో జరిగిన దాడుల స్వభావాన్ని అధ్యయనం చేయాలి. నిరుడు అక్టోబర్‌లో మధ్య కశ్మీర్‌లో ఏడుగురు కార్మికులను పొట్టనబెట్టుకున్నది మొదలు మొన్నటి పహల్గాం మారణకాండ వరకూ జరిగిన నాలుగు ఉదంతాల్లో కీలకపాత్ర పోషించింది మూసాయే అంటున్నారు. అదే నిజమైతే మన నిఘా వ్యవస్థ సక్రమంగా లేదని భావించాలి. మొన్న విపక్షాలతో జరిగిన సమావేశంలో కూడా కేంద్ర ప్రభుత్వం నిఘా వైఫల్యం ఉన్నదని అంగీకరించింది. కనుక పాకిస్తాన్ ప్రాపకంతో చెలరేగుతున్న ఉగ్రవాదులను గురిచూసి కొట్టటానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టే మన నిఘా వ్యవస్థను కూడా మరింత పటిష్టం చేయాలి. జవాబుదారీ తనాన్ని నిర్ధారించాలి. ఉగ్రవాదులు మన లోటుపాట్లేమున్నాయో చూసుకునే దాడులకు దిగుతారు. ఆ పని మన నిఘా వర్గాలు చేయగలిగితే ఉగ్రవాదుల్ని నిరోధించటంతోపాటు వారిని చాకచక్యంగా పట్టి బంధించటానికి కూడా వీలవుతుంది. అప్రమత్తత లోపించటంవల్ల నిరాయుధ పౌరుల ప్రాణాలు మాత్రమేకాదు... స్థానికుల జీవిక కూడా దెబ్బతింటుంది. తాజాగా ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో కశ్మీర్‌లోని 50కి పైగా పర్యాటక స్థలాలను మూసివేసినట్టు అధికారులు ప్రకటిస్తున్నారు. అంటే కొన్ని వేల కుటుంబాల ఉపాధి దెబ్బతింటుంది. మున్ముందు తెరిచినా అటువైపు వెళ్లేందుకు పర్యాటకులు జంకుతారు గనుక ఆ రంగం కోలుకోవటానికి చాలా సమయం పడుతుంది. అన్నిటికన్నా మన నేతలు మాటలూ, చేతలూ అదుపులో పెట్టుకోవటం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం. రెండు పక్షాలు పరస్పరం తలపడుతున్నప్పుడు ఎవరి బలం ఎక్కువన్న దాన్నిబట్టి ఫలితం ఆధారపడి వుండదు. ఎవరు కలిసికట్టుగా ఉన్నారో, ఎవరు మెరుగైన వ్యూహం పన్ను తున్నారో, ఎవరి ఎత్తుగడలు సరైనవో వారినే విజయం వరిస్తుంది. జరిగిన భద్రతాలోపాలకు బాధ్యులెవరో నిర్ణయించాలని అనటం, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరటం వరకూ ఎవరికీ అభ్యంతరం ఉండదు. నిర్మాణాత్మకమైన విమర్శలూ ఆహ్వానించదగ్గవే. కానీ ప్రధాని చిత్రాన్ని ఒక పార్టీ తప్పుడుగా చిత్రిస్తే, మరొకరు దానికి జవాబుగా విపక్షనేత వెన్నుపోటుకు సిద్ధంగా వున్నట్టు మరో చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాంగ్రెస్ నేతల్ని పాకిస్తాన్ పొమ్మంటూ ఉచిత సలహా ఇచ్చారు. 26 మంది అమాయకుల ఉసురు తీసిన ఉగ్రవాదులను ఏరిపారేయటానికి ఏం చేయాలన్న అంశంలో మన భద్రతా వ్యవస్థ తలమునకలై వుంది. ఈ పరిస్థితుల్లో ఐక్యతను చాటి ఆదర్శంగా వుండాల్సిన నాయకులు దిగజారుడు పోస్టులతో అధ్వాన్నంగా ప్రవర్తిస్తున్నారు. ఇదంతా దేశభక్తి అనే భ్రమలో వీరు కాలక్షేపం చేస్తున్నారు. వీరిని చూసి అనుచరగణాలు మరింత రెచ్చిపోతున్నాయి. మతం పేరిట, ప్రాంతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి. ఫలితంగా వేర్వేరు ప్రాంతాల్లోని కశ్మీరీ చిరువ్యాపారుల పైనా, విద్యార్థుల పైనా దాడులు జరుగుతున్నాయి. ఇదంతా మనపై మనమే యుద్ధం చేసుకోవటం. శత్రువుపై సమష్టిగా పోరాడాల్సిన సమయంలో బాధ్యత మరిచి అంతర్గత కలహాలకు దారితీసేలా ప్రవర్తించటం, పైస్థాయి నేతల ప్రాపకానికి వెంపర్లాడటం అత్యంత హీనం. పాపం. సక్రమంగా మాట్లాడటంరాని నేతలు కొన్నాళ్లయినా నోరుమూసుకోవటం ఉత్తమం.

# యుద్ధం ప్రారంభించాలంటే ఈ వ్యూహం సిద్ధం చేసుకోవాల్సిందే!

న్యూఢిల్లీ,ప్రపంచ చరిత్రను తిప్పి చూస్తే, యుద్ధాలు ఎన్నిసార్లు జయాలు అందించినా, వాటి దీర్ఘకాలిక ప్రభావాలే ఆ దేశాల భవిష్యత్‌ను రూపుదిద్దాయి. గెలిచిన దేశాలకూ, ఓడి పోయిన దేశాలకూ రెండింటికీ తగిన గుణ పాఠాలే ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో, భారత్ పాక్‌పై యుద్ధం ప్రారంభించాలంటే, తాత్కాలిక విజయానికి మాత్రమే కాదు.. భవిష్యత్ భద్రతా, ఆర్థిక, సామాజిక స్థిర త్వానికి కూడా దోహదపడేలా వ్యూహం సిద్ధం చేసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.యుద్ధం ప్రారంభించే ముందు విజయం ఎలా కనిపించాలి, శాంతి ఎలా సాధించాలి అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు సిద్ధం చేసుకున్నప్పుడు మాత్రమే, యుద్ధం విజయవంతం అవుతుంది. లేదంటే అది మరో అంతులేని సమస్యల చక్రవ్యూహంగా మారిపోతుంది. యుద్ధం తాత్కాలిక గర్వాన్నిచ్చి, దీర్ఘకాలికంగా దేశాన్ని క్షీణింపజేసే ప్రమాదం సైతం కూడా ఉంటుంది.

యుద్ధం తాత్కాలిక గర్వాన్నిచ్చినా..

యుద్ధం అనేది ఒక చక్రం.. ప్రారంభించినప్పుడు మాత్రమే కాదు, దాన్ని ముగించి, విజయాన్ని సుస్థిరం చేయడం కూడా సమాన ప్రాధాన్యం గలది. భారత్‌కు పాక్‌పై యుద్ధం ప్రారంభించడం కేవలం ఆగ్రహానికి ప్రతిస్పందనగా మాత్రం కావొద్దు. అది ఒక జాతీయ భద్రతా వ్యూహం తుది దశ. అందుకే, ప్రతీ అడుగు, ప్రతీ నిర్ణయం, దీర్ఘకాలిక దృష్టితో, ప్రణాళిక బద్ధంగా తీసుకోవాలి. క్షణిక విజయాలు కాక, శాశ్వత స్థిరత లక్ష్యంగా ముందుకెళ్లాలి. యుద్ధం ప్రారంభించే ముందు విజయం, శాంతి ఎలా సాధించాలనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు సిద్ధం చేసుకున్నప్పుడు మాత్రమే, యుద్ధం విజయవంతం అవుతుంది. లేదంటే అది మరో అంతులేని సమస్యల చక్రవ్యూహంగా మారిపోతుంది.

నిర్దిష్ట లక్ష్యం స్పష్టంగా లేకపోతే..

భారత్ ఎప్పటికీ ఆక్రమణ దురుద్దేశంతో కాక, అవసరమైన పక్షాన మాత్రమే శస్త్రాన్ని ఎత్తుకున్న దేశంగా పేరుగాంచింది. కానీ పాకిస్తాన్ మిలిటరీ తరచూ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తూ, ఎక్కడో ఒకచోట సరిహద్దు ఉల్లంఘనలకు పాల్పడుతుంది. ఈ నేపథ్యంలో, భారత్‌కి తగిన ప్రతి చర్య తీసుకోవడం తప్పనిసరి అవుతుంది. ఈ దశలో యుద్ధం ప్రారంభించటమే సరైనదా కాదా? యుద్ధం ప్రారంభించిన తర్వాత మన లక్ష్యాలు ఏమిటి? దానికి మనం సిద్ధమా? అనే దానిపై స్పష్టత ఉండాలి. యుద్ధ ప్రారంభానికి ముందే కీలక వ్యూహాలు రచించుకోవాలి. యుద్ధం ఎందుకు చేస్తున్నామో స్పష్టంగా నిర్దిష్ట లక్ష్యంతో నిర్వచించాలి. ఆ నిర్దిష్ట లక్ష్యం స్పష్టంగా లేకపోతే, యుద్ధం అనవసరంగా పరిణమిస్తుంది, లక్ష్యచ్యుతమవుతుంది. యుద్ధం వల్ల సాధించదలచుకున్న లక్ష్యాన్ని ఖచ్చి తంగా నిర్వచించాలి. ఒకవేళ భారత్ పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకోవడం, ఉగ్రవాద మౌలిక కేంద్రాలను ధ్వంసం చేయడం, పాకిస్తాన్ మిలిటరీ శక్తిని నాశనం చేయడం, అంతర్జాతీయంగా పాక్‌ను బహిష్కరించాలనే పరిస్థితి తేవడం వేరు.. యుద్ధం చేయడం వేరు.

ఆర్థిక ప్రణాళికలు..

యుద్ధం వల్ల ఏర్పడే ఆర్థిక భారం ఎలా భరించాలన్న దానిపై ముందస్తు ప్రణాళిక ఉండాలి. యుద్ధం ఖర్చులు ఎంత ఉండబోతున్నాయో కచ్చితంగా అంచనా వేయాలి. ఒక్క యుద్ధ సంవత్సరం ఖర్చు కనీసం 8-9 లక్షల కోట్లు. ఇది జీడీపీకి సుమారు 3% అదనపు భారం. రక్షణ, పునర్నిర్మాణ వ్యయాలు, భద్రతా వ్యయం పెరుగుదల మొదలైన వాటిని సమర్థవంతంగా నిర్వహించే దిశగా ప్లాన్ ఉండాలి, దీనికి ముందస్తుగా బడ్జెట్ సిద్ధం చేయాలి, అవసరమైన చోట పెట్టుబడులు మళ్లించాలి.

దాడి జరిగితే..

దేశంలో ప్రజల సహనం, మద్దతు, దేశభక్తిని నిలబెట్టుకునేలా ప్రభుత్వాలు



ముందస్తుగా కార్యక్రమాలు రూపొందించాలి. విపక్షాలు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహకరించేలా సమన్వయం కావాలి. దేశీయంగా మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రజలను జాగ్రత చేయాలి. రేషన్ పంపిణీ, విద్యుత్, నీటి సరఫరాలపై ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. యుద్ధ ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఇతర ప్రాంతాలకు సురక్షితంగా తరలించేందుకు ప్లాన్లు సిద్ధం చేయాలి. రేషన్ పంపిణీ వ్యవస్థ, వైద్య సేవలు, ప్రజల గమనికల కోసం ప్రత్యేక చర్యలు (జనరల్ మొబిలైజేషన్ ప్లాన్) సిద్ధంగా ఉండాలి. యుద్ధ సమయంలో నగరాలు, పరిశ్రమలు, విద్యుత్, నీటి సరఫరాలపై దాడులు జరిగితే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలి. సరిహద్దు రక్షణను బలపరచాలి. లైన్ ఆఫ్ కంట్రోల్ ద్వారా ముమ్మరంగా ఆక్రమణ ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రత్యేక దళాల్ని ఉగ్రవాద మౌలిక కేంద్రాలపై దాడులకు సిద్ధం చేయాలి.

యుద్ధం తర్వాత వ్యూహం ముఖ్యం!

విజయం సాధించిన తర్వాత కూడా పరిసర దేశాల్లో విధేయ ప్రభుత్వాలు ఏర్పరచడం, శాంతి నిలుపుదల దళాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. లేకపోతే శూన్యతలో తిరిగి ఉగ్రవాద సంస్థలు, మిలిటెంట్లు విస్తరిస్తారు. పాకిస్తాన్ మిలిటరీ లేదా ఉగ్రవాద తిరుగుబాట్లు, పీఓకేలో స్వతంత్ర ఉగ్ర దళాల తిరుగుబాట్లు, పాక్ మిలిటరీ ఎత్తుగడలు తట్టుకోవడానికి ముందస్తు చర్యలు అవసరం. చైనా పాక్‌కు మద్దతుగా ముట్టడి చర్యలు తీసుకుంటే, ద్విపక్ష సంబంధాలు మరింత క్షీణించవచ్చు. ఆ ప్రమాదాన్ని తట్టుకోగల సన్నద్ధత ఉండాలి. యుద్ధం కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణాన్ని, మందగించిన వృద్ధిని తిరిగి నిలబెట్టుకోవడానికి, ఆర్థిక సంస్కరణలు, విదేశీ పెట్టుబడుల పునర్నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి అవసరం.

# జాతీయ జెండా ఎగురేసిన జవాన్లు

ములుగు,తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలోని కర్రెగుట్టల్లో మావోయిస్టు నేతలను లక్ష్యంగా చేసుకొని చేపట్టిన ఆపరేషన్ 9వ రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా కర్రెగుట్టలను భద్రతాబలగాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. కర్రెగుట్టపై పూర్తి పట్టును సాధించడంతో ఆపరేషన్ కగార్ సక్సెస్ అయింది. 10 వేలకు పైగా సాయుధ బలగాలలు ఈ ఆపరేషన్ లో పాల్గొన్నాయి. వేల అడుగుల ఎత్తులోని కర్రెగుట్టల్లో శిఖరం వరకు చేరుకున్న బలగాలు బుధవారం జాతీయ పతాకాన్ని ఎగురవేస్తూ కనిపించాయి. సీఆర్‌పీఎఫ్ నేతృత్వంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, కోబ్రా బలగాలు పెద్ద సంఖ్యలో తెలంగాణ సరిహద్దులోని కొత్తపల్లి నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని పూజారికాంకేరు, నంబి, గల్‌గం, నడిపల్లి ల్లో పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపడుతున్నాయి. ఈ ఆపరేషన్‌నేరుగా ఐబీ చీఫ్ రాయపూర్ నుంచి పర్యవేక్షించారు. ఇప్పటికే కర్రెగుట్టను పోలీసు భద్రతా బలగాలు అష్టదిగ్బంధనం చేసి ఆ ఏరియాల్లో మావోయిస్టులు అమర్చిన 150కు పైగా ఐఈడీలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఆపరేషన్ తో పాత టీమ్ ను వెనక్కి రప్పించి..

# డిగ్రీలు వస్తున్నా... స్కిల్స్ ఉండడం లేదు

హైదరాబాద్,ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడి చదివి డిగ్రీ తీసుకొని బయటకు వచ్చిన యువతకు స్కిల్స్ ఉండటం లేదని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆవేదన చెందారు. యువతలో స్కిల్స్ పెంచేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని అందు కోసమే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ లోబుధవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కోమటి రెడ్డి ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీ÷-న్ ను, సోలార్ రూఫ్ టాప్, స్పేస్ అకాడమీ డబ్బింగ్ స్టూడియో ను, సి ఎస్ ఆర్ కింద ఐసీఐసీఐ బ్యాంక్ ఏర్పాటు చేసిన 100 కె వి సోలార్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. సినిమా కోర్సులు నేర్చుకున్న 22 మంది బ్యాచ్ కు ఆయన సర్టిఫికెట్ లు అందచేశారు. ఈ సందర్భంగా కోమటి రెడ్డి మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగుమే పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత మాదక ద్రవ్యాలకు బానిస అవుతుందని అన్నారు. నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనేందుకు యువతకు వివిధ రంగాలలో స్కిల్ యూనివర్సిటీ-శిక్షణ ఇస్తుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కి సీఎం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలకు ఇళ్ళ నిర్మాణంలో మెస్త్రి ట్రైనింగ్ ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ళ స్కీమ్ కింద చేపట్టే నిర్మాణాలు వారితోని చేయిస్తున్నామని కోమటిరెడ్డి అన్నారు. సినిమా టెక్నీషియన్ కు న్యాక్ లో శిక్షణ ఇస్తామని ఈ విషయంలో త్వరలో దిల్ రాజు , సినిమా వాళ్ళ తో సమావేశం ఏర్పాటు చేస్తున్నారన్నారు. నల్గొండ లో స్కిల్ -ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు- చేశామని ప్రతి ఏటా 10 వేల మందికి -ట్రైనింగ్ ఇస్తూ 100 శాతం జాబ్ ప్లేస్ మెంట్ కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. న్యాక్ ఎండి ఆర్ అండ్ బి స్పెషల్ సెక్రటరీ హరిచందన మాట్లాడుతూ స్కిల్ -ట్రైనింగ్ అనేది డిగ్రీ కాదని ఇది ఒక కోర్స్ అనే విషయం గమనించాలని నిత్యం స్కిల్స్ నేర్చుకుంటూ ఉండాలని అన్నారు. గత ఏడాది లో వివిధ కోర్స్ లో 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చామని ఈ సంఖ్య ను రానున్న రోజుల్లో పెంచు తమని హరిచందన అన్నారు. ఇందులో 99 శాతం మందికి పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో 10 ఉమ్మడి జిల్లా లో న్యాక్ రీజనల్ కేంద్రాలు కూడా ఏర్పాటు- చేశామన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల కు చెందిన వాళ్ళు న్యాక్ లో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాక్ అధికారులు పాల్గొన్నారు.

# మార్పులకు శ్రీకారం..

హైదరాబాద్, ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి లీకు వీరులపై వేటు వేయడం మొదలుపెట్టినట్టు కనిపిస్తున్నది. పరిపాలనా యంత్రాంగంపై తన పట్టు పెంచుకునేందుకు సచివాలయంలో బదిలీలు చేపట్టారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో కూడా మార్పులకు శ్రీకారం చుట్టారు. నేడో రేపో జిల్లా కలెక్టర్లను కూడా బదిలీ చేయవచ్చని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర అవుతున్నా ఇంకా గత బీఆర్ఎస్ ప్రభుత్వ లక్షణాలు అధికారవర్గాల్లో పోలేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. పాత ప్రభుత్వమే కొనసాగుతున్నదా? అనే విధంగా సచివాలయం మొదలు గ్రామ స్థాయి వరకు ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సచివాలయంలో ఉన్నత స్థాయిలో జరిగే సమావేశాల వివరాలు ఎప్పటికప్పుడు ప్రతిపక్ష పెద్దలకు వెళ్ళడం, వాళ్లు అప్రమత్తమై దిద్దుబాటుకు దిగడం జరుగుతోంది.కొన్ని సందర్భాల్లో తమకు అందిన సమాచారంతో ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారన్న అనుమానాలూ ప్రభుత్వ పెద్దల్లో ఉన్నాయి. ఎక్కడి నుంచి సమాచారం బయటకు వెళ్తుందో తెలియక కొన్ని సందర్భాలలో ముఖ్యమంత్రి సైతం తలపట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. జపాన్ పర్యటన ముగించుకుని వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన కార్యదర్శితో పాటు సచివాలయంలో బదిలీలపై దృష్టి సారించి ఆదేశాలు జారీ చేయించారు. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కే రామకృష్ణారావును నియమించారు. ఆ వెంటనే సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేయించారు. ప్రధాన కార్యదర్శిగా జయేశ్ రంజన్‌ను నియమించుకోవాలని రేవంత్ రెడ్డి అనుకోగా సాధ్యం కాలేదు. దీంతో ఆయను పరిశ్రమలు, పెట్టుబడుల సెల్‌తోపాటు పాటు స్పీడ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రస్తుతం ముఖ్య కార్యదర్శి వీ శేషాద్రితోపాటు జాయింట్ సెక్రటరీగా ఎస్ సంగీత సత్యానారాయణ పనిచేస్తున్నారు. సంగీతను అక్కడి నుంచి తప్పించి ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం డైరెక్టర్ గా బదిలీ చేశారు. సాధారణంగా అఖిల భారత సర్వీసులో సీనియర్ అధికారికి గౌరవం ఇవ్వడం విధానపరంగా కొనసాగుతూ వస్తున్నది. ముఖ్యమంత్రి కార్యాలయంలో శేషాద్రి గతంలో మాదిరి పనిచేస్తారా లేదా జయేశ్ రంజన్‌దే పై చేయి ఉంటుందా అనేది చూడాలి.

నిర్ల్యక్ష్యానికి మూల్యం?

తన, మన అనే తేడా లేకుండా పలువురు ఐఏఎస్ లకు అవకాశాలు ఇచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకోవడం లేదనే నిర్ణయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చారని తెలుస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటు అయి ఏడాదిన్నర అవుతున్నా కొందరు అధికారులు ఇంకా నిర్లక్ష్యంగా పనిచేయడం, ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం ఆగ్రహాన్ని తెప్పించిందంటున్నారు. విధాన పరమైన నిర్ణయాలు, కీలకమైన అంశాలను గంటల వ్యవధిలో బీఆర్ఎస్ నాయకులకు చేరవేస్తున్నారనే దానిపై స్పష్టమైన సమాచారం ముఖ్యమంత్రికి అందిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తనవద్ద ఉన్న సమాచారంపై మరోసారి విశ్లేషించి, ప్రభుత్వ రహస్యాలు బయటకు ఎప్పటికప్పుడు లీకులు ఇస్తున్నవారిపై వేటు వేయాల్సిందేనని నిర్ణయానికి వచ్చారని ఆ వర్గాల కథనం. డబ్బుల సంపాదనే ధ్యేయంగా కొందరు ఐఏఎస్‌లు పనిచేస్తున్నారని గతంలో విమర్శించిన ఆయన.. తాజా బదిలీల్లో భాగంగా వీరిపై కూడా వేటు వేయడం సచివాలయంలో సంచలనంగా మారింది.

# పాక్ ఆక్రమి కాశ్మీర్ స్వాధీనమే సమస్యకు పరిష్కారం

న్యూఢిల్లీ,పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసకోవడమే కాశ్మీర్ సమస్యకు పరిష్కారమని భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదులను శిక్షించడానికి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. భారత్ కఠినంగా జవాబివ్వాలని కోరారు. పీఓకే ఎప్పటికీ భారత్‌దే అని మేఘనాథ్ దేశాయ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడిని దేశ ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా భారత సంతతికి చెందిన బ్రిటిష్ ఎంపీ లార్డ్ మేఘనాథ్ దేశాయ్ స్పందించారు. కశ్మీర్ వివాదాన్ని పూర్తిగా రూపుమాపాలంటే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని భారత ప్రభుత్వానికి సూచించారు. అదొక్కటే అన్ని సమస్యలకు పరిష్కారమన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి చాలా క్రూరమైనదని ఆవేదన వ్యక్తంచేశారు. కశ్మీర్ వివాదంలో ఈ ఘటనే చివరిది కావాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తాను నమ్ముతున్నానని అన్నారు. కశ్మీర్‌లో ఉన్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తానని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి నేరస్థులకు కఠిన శిక్ష విధించాలని తాము భారత్‌ను

# కులగణన సర్వే చారిత్రక నిర్ణయం

హైదరాబాద్, దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు- కుల గణన నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సాహసోపేత నిర్ణయం తీసుకున్న ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగబోతోందని, అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే ఈ సర్వేలో కులాల వారీగా ఎంత జనాభా ఉందో నిక్కచ్చిగా తెలుతుందని.. తద్వారా ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరిగే అవకాశముందని వివరించారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటని అన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ కుల గణనకు వ్యతిరేకి. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. జనగణన సమయంలో కూడా కులాన్ని చేర్చలేదని.. కులగణన చేపట్టాలంటూ 2010లో దేశవ్యాప్తంగా చాలా రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తే ఈ అంశంపై మంత్రుల బృందాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. కానీ, కుల గణనకు బదులుగా సర్వే మాత్రమే నిర్వహించాలని నిర్ణయించిందే తప్ప శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించలేదు. కేవలం ఓటు- బ్యాంకు రాజకీయాల కోసమే కులగణన అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తుతుందే తప్ప ఆ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ది లేదని అన్నారు. మోదీ సర్కార్ నిర్ణయం కాంగ్రెస్ ఘనతే అయితే డూప్లికేట్ గాంధీల ఏలుబడిలో కులగణన ఎందుకు చేయలేదో సమాధానం రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.తెలంగాణసహా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన ఈ కులగణన సర్వేల్లో పారదర్శకత లేనేలేదని అన్నారు. రాజకీయ లబ్ది కోసమే సర్వేలు నిర్వహిస్తూ తమకు అనుకూలమైన కులాల జనాభా పెంచుతూ, ఇతర కులాల జనాభాను తగ్గించే చూపే ప్రయత్నం చేశాయని.. తద్వారా సమాజంలో కులాల మధ్య కుమ్ములాటలు, అస్థిర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాజకీయ వ్యవహారాల కేబినెట్ కమిటీ- రాబోయే జనాభా లెక్కింపులో కుల గణనను చేర్చాలని ఈరోజు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక

# లాహోర్ నడిబొడ్డున సయీద్ అడ్డా!



ఇస్లామాబాద్:హఫీజ్ సయీద్.. కరడుగట్టిన పాకిస్థాన్ ఉగ్రవాది. లష్కరే తోయిబా అధినేతగా భారత్‌లో రక్తపుటేరులు పారిస్తున్నాడు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గతవారం జరిగిన ఉగ్రదాడికి కర్త, కర్మ, క్రియ అతడేనని నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుపై అమెరికా ప్రభుత్వం 10 మిలియన్ డాలర్ల (రూ. 84.58 కోట్లు) రివార్డు ప్రకటించింది. ఎన్నో ఉగ్రవాద దాడుల వెనుక మాస్టర్‌మైండ్‌గా వ్యవహరించిన హఫీజ్ సయీద్ పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడు. పాక్ ప్రభుత్వం ఈగ కూడా వాలనివ్వడం లేదు. ఎలాంటి ఆంక్షలు లేకుండా నిర్భయంగా తన పని తాను చేసుకుపోతున్నాడు. పాకిస్తాన్‌లో రెండో పెద్దనగరమైన లాహోర్‌లో ఓ ఖరీదైన ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఇంటి శాటిలైట్ చిత్రాలను, వీడియోలను 'ఇండియా టుడే' వార్తాసంస్థ తాజాగా బహిర్గతం చేసింది. లాహోర్‌లో జోహార్ టౌన్ అనే ప్రాంతం లో ఉన్న ఈ భవనం సాధారణంగా ఉగ్రవాద నేతల ఇళ్ల కంటే భిన్నంగా కనిపిస్తోంది.

శత్రువులు దాడి చేయకుండా ఎత్తుగడ

అంతర్జాతీయ ఉగ్రవాదులైన అల్-ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్, జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్ సాధారణ జనావాసాలకు దూరంగా నివసించారు. ఒంటరి ఇళ్లలోనే వారు మకాం వేశారు. పాకిస్తాన్‌లోని అబోటాబాద్ ఇంటిపై అమెరికా సేనలు దాడి చేసి, లాడెన్‌ను అంతం చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇంటి చుట్టూ ఖాళీ స్థలమే ఉండడం అమెరికా ఆపరేషన్‌కు బాగా కలిసొచ్చింది. 2019లో పుల్వామా దాడికి కారకుడైన మరో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజార్ పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని బహల్వపూర్‌లో ఓ ఒంటరి ఇంట్లో నివసిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పసిగట్టాయి. ప్రధాన రహదారి పక్కనే ఈ ఇల్లు ఉంది కానీ చుట్టూ జనావాసాలేవీ లేవు.సామాన్య ప్రజలకు దూరంగా రహస్య ప్రాంతాల్లో ఉండడానికి ఉగ్రవాదులు ఇష్టపడుతుండగా, హఫీజ్ సయీద్ వ్యూహం మరోలా ఉండడం గమనార్హం. లాహోర్ నడిబొడ్డున అత్యంత రద్దీగా ఉండే చోట తన స్థావరం ఏర్పాటు చేసుకున్నాడు. శత్రువులు దాడి చేయకుండా ఈ జాగ్రత్త తీసుకున్నట్లు తెలుస్తోంది.సామాన్య ప్రజల నివాసాలు ఉన్నచోట దాడులు చేస్తే ప్రాణనష్టం అధికంగా జరిగే ప్రమాదం ఉంటుంది. ప్రపంచ దేశాల నుంచి విమర్శలు రావొచ్చు. అందువల్ల ప్రత్యర్థులు దాడులు చేయడానికి వెనుకడవచ్చు. లాహోర్‌లో హఫీజ్ సయీద్ ఇల్లు శత్రుదుర్భేద్యంగా కనిపిస్తోంది. ఇదొక కాంపౌండ్ అని చెప్పొచ్చు. ఈ ప్రాంగణంలోనే ఒక పాత భవనంతో పాటు మరికొన్ని ఇళ్లు, మసీదు, మదర్సా(హఫీజ్ సయీద్ కార్యాలయం), ఒక ప్రైవేట్ పార్కు ఉన్నాయి. హఫీజ్ కుటుంబం కూడా ఇక్కడే ఉంటోంది. అతడికి పాకిస్తాన్ సైన్యంతోపాటు సొంత ప్రైవేట్ సైన్యం పటిష్టమైన భద్రత కల్పిస్తున్నాయి. ఇక్కడి మసీదులోనే హఫీజ్ సయీద్ ఎక్కువ సమయం గడుపుతుంటాడు. విద్యార్థుల ముసుగులో అతడి అనుచరులు సైతం ఇందులోనే ఆశ్రయం పొందుతున్నారు.

ఇంటి కింద బంకర్

లాహోర్‌లోని అల్-ఖదీసియా మసీదు గతంలో హఫీజ్ సయీద్ కార్యకలాపాలకు అడ్డాగా ఉండేది. పుల్వామా ఉగ్రదాడి అనంతరం బాలాకోట్‌లో భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్ చేయడంతో అతడిలో భయం మొదలైంది. అల్-ఖదీసియా మసీదులో ఉండడం సురక్షితం కాదని ఇప్పుడున్న కాంపౌండ్‌కు మకాం మార్చాడు. 2021లో ఈ ఇంటికి సమీపంలో కారుబాంబు పేలుడు సంభవించి ంది. ముగ్గురు మరణించారు. దాంతో హఫీజ్ సయీద్ భద్రతను మరింత పటిష్టం చేశారు. ఈ కాంపౌండ్ లోపల, బయట గట్టి నిఘా ఉంటుంది. సాయుధులు రోజంతా నిర్విరామంగా పహారా కాస్తుంటారు. స్థానికులను కాంపౌండ్ సమీపంలోకి కూడా అనుమతించరు. అనుమతి ఉన్న వ్యక్తులు రావాలంటే రకరకాల తనిఖీలు ఉంటాయి. అంతేకాదు ఇక్కడ డ్రోన్లు ఎగురవేయడం నిషేధించారు. ఫొటోలు, వీడియోలు చిత్రీకరించడం కుదరదు. హఫీజ్ సయీద్ నివాసం కింద ఉక్కు కోట లాంటి బంకర్ ఉన్నట్లు తెలుస్తోంది.

జైల్లో ఉన్నాడంటూ కల్లబొల్లి కబుర్లు

ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చిన కేసులో హఫీజ్ సయీద్‌కు 31 ఏళ్ల జైలుశిక్ష పడిందని, జైల్లో పెట్టామని పాకిస్తాన్ పైకి నమ్మబలుకుతోంది.

# అప్పుడే సామాన్యులకు ఊరట

న్యూఢిల్లీ,దేశంలో పెరుగుతున్న దరల కారణంగా పెట్రో ధరలను కంట్రోల్ చేస్తే..ఇతరత్రా రవణా ఛార్జీలు తగ్గుతాయి. ఆ మేరకు సరుకులపైనా ధరలు తగ్గుతాయి. ఈ తరహా ఆలోచన చేయడం లేదు. గత ఐదారేళ్లుగా పెట్రో ధరలపై ప్రధాని అవాస్తవాలు చెబుతున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. నిజానికి చమురు కంపెనీలు గనుక ఈ విధంగా ధరలను పెంచిన్నట్లైతే, అది అక్కడితో ఆగిపోదు. మొత్తం ఆర్థిక వ్యవస్థలో అనేక వస్తువుల ధరలు దాని ఫలితంగా పెరుగుతాయి. కాంగ్రెస్ హయాంలో పెట్రో ధరలపై విరుచుకు పడ్డ మోడీ ఇప్పుడా విషయం మరచిపోయినట్లు ఉన్నారు. ధరల పెరుగుదాల, జీఎస్టీపైనా గుజరాత్ సిఎంగా విమర్శలు గుప్పించిన విషయం ప్రజలు ఇంకా మరచి పోలేదు. నిజానికి కేంద్రంపెట్రోల్‌పై ముందుగా ఎక్సైజ్ డ్యూటీ తగ్గించివుంటే బాగుండేది. ఆ తర్వాత వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలకు చెప్పివుంటే మోడీ నిజాయితీగా ఉన్నాడని అనుకునే వారం. మోడీ అధికారంలోకి వచ్చాక లీటర్ పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ. 18 కిపైగా పెంచారని కాంగ్రెస్ నేతలు పదేపదే చెబుతూనే వచ్చారు. యూపీఏ హయాంలో లీటర్ పెట్రోల్‌పై రూ. 9.84 ఎక్సైజ్ డ్యూటీ ఉండగా.. మోడీ దాన్ని రూ. 27.90కు, లీటర్ డీజిల్‌పై రూ. 3.56గా ఉన్న సుంకాన్ని రూ. 21.80కు పెంచారు. వ్యాట్ తగ్గించమని రాష్ట్రాలను కోరే ముందు ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి చిత్తశుద్ధి చాటుకుంటే బాగుండేది. ఇదిలా ఉంటే సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూపంలో లక్షల కోట్లు ఆదాయం వస్తున్న విషయాన్ని ప్రధాని ప్రజలకు చెప్పడం లేదు. ఎక్సైజ్ సుంకం ద్వారా కేంద్రానికి రూ. 26 లక్షల కోట్ల ఆదాయం వచ్చిన విషయాన్ని ప్రధాని ఎక్కడా ప్రస్తావించడంలేదు. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రాల వాటాను సకాలంలో చెల్లించడం లేదు. కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని..ఆ తర్వాత రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలి. అప్పుడే పెట్రో ధరలు తగ్గి రవాణా ఛార్జీలు తగ్గుతాయి. దీంతో సరకు రావాణా భారం కూడా తగ్గుతుంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, అక్కడి ప్రభుత్వాలు విలువ ఆధారిత పన్ను వ్యాట్ తగ్గించకపోవడమే ఇందుకు కారణమని బిజెపి నేతలు నీతులు వల్లిస్తున్నారు. ఓ రకంగా పెట్రో ధరలపై రాష్ట్రాలను అప్రతిష్టపాలు చేయాలన్న ఆలోచన తప్ప నిర్మాణాత్మక ఆలోచన మాత్రం చేయడం లేదు. సామాన్య ప్రజలకు ఊరట కలిగించడానికి, దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ డ్యూటీ,వ్యాట్ తగ్గించాల్సిందే. అప్పుడు ప్రభుత్వం కూడా తన వ్యయాన్ని ఆ మేరకు పెంచవలసి వుంటుంది. ఆ విధంగా అదనపు వ్యయం చేయాలంటే అందుకోసం ప్రభుత్వం తన ఆదాయాన్నీ పెంచుకోవాలి, అందుకు ప్రభుత్వం పెట్రో ఉత్పత్తుల మీద తనకు వచ్చే పన్ను ఆదాయాన్ని పెంచుకోవాలి. ప్రభుత్వం మాదిరిగానే పెట్రో ఉత్పత్తులను వినియోగించే ప్రతీ సంస్థా ఆర్‌టిసి, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలువంటివి కూడా తమ సేవల రేట్లు పెంచవలసి వుంటుంది. ఇదంతా కలిసి ద్రవ్యోల్బణాన్ని పెంచుతాయి. ఇంతటితోనే ఇది ఆగదని, రాబోయే రోజుల్లో ఇదే విధమైన వడ్డింపులు మరిన్ని రానున్నా యని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అటు కంపెనీలూ చమురు పెరుగుదల భారాన్ని భరించడానికి సిద్ధంగా లేవు. ఇటు ప్రభుత్వమూ పెరిగే ధరల ద్వారా తనకు లభించే అదనపు ఆదాయాన్ని వదులు కోడానికి సిద్ధంగా లేదు. భారమంతా వినియోగదారులపైనే పడేయడం ద్వారాచేతులు దులుపుకోవాలన్న ధోరణిలో పాలకులు ఉన్నారు.

# భారత్ పాక్ యుద్ధం! చైనా ఎవరి వైపు ?

సెంట్రల్ డెస్క్: భారత్ పాక్ మధ్య యుద్ధం వస్తే చైనా ఎవరి వైపు ఉంటుంది? తాజాగా పహెల్గాం దాడిలో, దాడి తర్వాత కూడా బయట పడ్డ చైనా ఆనవాళ్లేంటి? డ్రాగన్ దేశం ఈ మొత్తం ఇష్యూలో ఎలాంటి వైఖరి అవలంబించేందుకు ప్రయత్నిస్తోంది. అసలు చైనా వాదనేంటి? రెండు దేశాల విదేశాంగ మంత్రుల మధ్య సాగిన సంభాషణ మనకు ఎలాంటి సంకేతాలను అందిస్తోంది.

భారత్ పాక్ మధ్య యుద్ధం వస్తే చైనా ఎవరి వైపు ఉంటుంది?

పాకిస్థాన్‌ని కూడా దాదాపు తమ సొంత భూభాగంగానే పరిగణిస్తోన్న చైనా.. భారత్ పాక్ మధ్య యుద్ధం వస్తే చైనా ఎవరి వైపు ఉంటుంది? ఆప్షన్ ఏ) చైనా, ఆప్షన్ బి) చైనా, ఆప్షన్ సీ కూడా సేమ్ అన్సర్. ఇందులో ఎలాంటి అనుమానం లేదు. ఎందుకంటే చైనా ప్రస్తుతం ఎన్నెసి అంతర్జాతీయ సమస్యలను ఎదుర్కొంటున్నా.. వైఖరిలో మార్పు వస్తుందని ఆశించడం పొరబాటే. ఇది మరోమారు తేట తెల్లమైందా? అంటే అదే నిజమని తెలుస్తోంది.

పాక్ విదేశాంగ మంత్రితో మాట్లాడిన చైనా విదేశాంగ మంత్రి

చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి, పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్‌తో ఫోన్లో మాట్లాడారు. ఉగ్రవాద దాడి తర్వాత జరుగుతున్న పరిణామ క్రమాలను చైనా నిశితంగా గమనిస్తోందని.. ఈ ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తునకు మద్ధతు ఇస్తున్నట్టు చెప్పారు చైనా ఫారిన్ ఎఫైర్స్ మినిస్టర్.

పాకిస్థాన్ భద్రతా సమస్యలను అర్థం చేసుకుంటాం చైనా

ఇక్కడి వరకూ సాధారణంగానే జరిగిన ఈ సంభాషణ.. పెద్దరికంగా కనిపించింది. ఆ తర్వాత సాగిన మాటల్లో అసలు విషయం బయట పడింది. అదేంటని చూస్తే ఉగ్రవాద వ్యతిరేక చర్యలలో పాకిస్థాన్ కి ఎప్పుడూ మద్ధతు నిలుస్తుందని అన్నారు చైనా మంత్రి వాంగ్ యి. పాకిస్థాన్ కి దృఢమైన స్నేహితుడిగా ఉంటుందని.. చెప్పుకొచ్చారు చైనా విదేశాంగ మంత్రి. వ్యూహాత్మక భాగస్వామిగా.. పాకిస్థాన్ భద్రతా సమస్యలను అర్థం చేసుకుంటుందని.. కామెంట్ చేశారు. పాకిస్థాన్ సార్వభౌమాధికారం, భద్రతా ప్రయోజనాలను కాపాడ్డంలో తాము స్పష్టమైన మద్ధతునిస్తున్నట్టుగా చెప్పారు చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి. ఇక్కడే అసలు విషయం బయట పడిపోయింది.

పరిస్థితి అదుపులోకి తేవడానికి ఇరుపక్షాలు చొరువ చూపాలన్న చైనా

పాక్ మంత్రితో ఇంకా ఎన్నో విషయాలను మాట్లాడారు చైనా మంత్రి. చైనా ప్రస్తుత పరిస్థితిని దాని పురోగతిని నిశితంగా పరిశీలిస్తోందనీ.. వీలైనంతగా నిష్పాక్షిక దర్యాప్తునకు మద్దతిస్తుందని కూడా అన్నారు వాంగ్. ఈ వివాదం విషయంలో భారత్, పాక్ కాస్త సంయమనం పాటించాలని చెప్పుకొచ్చారు చైనా మంత్రి. పరిస్థితిని అదుపులోకి తేవడానికి ఇరు పక్షాలు చొరవ చూపాలని కూడా కోరారు. ఇదెలాగుందంటే తానే గిల్లి జోలపాడినట్టు ఉందని భావిస్తున్నారు నిపుణులు.

ఉగ్రదాడి తర్వాత ఉద్రిక్తతను చైనాకు వివరించిన పాక్

ఇక పాక్ ఉప ప్రధాని కూడా అయిన దార్ వర్షెన్ ఎలాగుందో చూస్తే.. ఉగ్రదాడి తర్వాత భారత్‌తో తలెత్తిన ఉద్రిక్తతను చైనాకు వివరించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ఇస్లామాబాద్ ఎప్పుడూ గట్టిగానే నిలబడుతుందని అన్నారు. ఎలాంటి పరిస్థితులను అయినా ఎదుర్కోడానికి సిద్ధంగానే ఉందని అన్నారు. పరిణితి చెందిన రీతిలో పరిస్థితి చక్కబెట్టే యత్నం పాక్ చేస్తుందని అన్నారు పాక్ మంత్రి. ప్రపంచ సమాజంతోనూ టచ్ లోనే ఉన్నామని వాంగ్‌తో అన్నారు దార్. భారత్ తమపై ఏకపక్ష చట్ట విరుద్ధ చర్యలు చేపడుతోందని.. నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని .. ఈ విషయంలోనే భారత్‌తో తాము వ్యతిరేకిస్తున్నట్టు చెప్పుకొచ్చారు పాక్ విదేశాంగ మంత్రి.

కొండంత బలాన్ని ఇచ్చిన ఆనందం వ్యక్తం చేసిన పాక్

ఇవన్నీ ఇలా ఉంటే ఈ ఇరువురి నేతల మధ్య సాగిన సంభాషణ ద్వారా బయట పడ్డ అసలు విషయం ఏంటని చూస్తే.. ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. పాక్ సార్వభౌమత్వానికి ఎలాంటి ఇబ్బంది తలెత్తినా.. దాన్ని తిప్పి కొట్టేందుకు తాము సదా సిద్ధమని చైనా చెప్పడం. ఇక్కడే చైనా పాక్ సపోర్టర్‌గా డిక్లయిర్ చేసుకోవచ్చు. అందుకే పాక్ విదేశాంగ మంత్రి దార్, తమకింతటి మద్దతునిస్తోన్న చైనా మంత్రికి థాంక్స్ చెప్పారు పాక్ మంత్రి దార్. తమ వ్యూహాత్మక భాగస్వామి మాటలు కొండంత బలాన్ని ఇచ్చినట్టు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

దాడిలో వాడిన సమాచార సాధనాలు కూడా చైనావే

ఇవన్నీ ఇలాగుంటే దాడి సమయంలో ఉగ్రవాదులు వాడిన సమాచార సాధనాలు కూడా చైనాకు చెందినవేని తెలుస్తోంది. ఒకరికొకరు కమ్యూనికేట్ చేసుకోవడానికి ఉగ్రవాదులు చైనా యాప్ లు, ఇతర పరికరాలను వాడినట్టు చెబుతున్నాయి నిఘా వర్గాలు.

2020 గాల్వాన్ ఘర్షణ తర్వాత భారత్‌లో చైనా యాప్‌ల నిషేధం

2020 గాల్వాన్ ఘర్షణ తర్వాత భారత్ లో నిషేధించిన ఈ యాప్ ల ద్వారా ఉగ్రవాదులు సమాచారం ఇచ్చిపుచ్చుకున్నట్టు తెలుస్తోంది. పహెల్గాం దాడి జరిగిన రోజు.. ఆ ప్రాంతంలో ఒక చైనీస్ శాటిలైట్ ఫోన్ ఉన్నట్టు గుర్తించాయి నిఘా వర్గాలు. ఈ రెండు విషయాలు ఎన్ఐఏ దర్యాప్తులో బయట పడ్డాయి.

పహెల్గాం దాడి ముందు వెనక చైనా పాత్ర స్పష్టం

వీటన్నిటిని బట్టీ చూస్తే.. పహెల్గాం దాడి ముందు వెనక చైనా పాత్ర స్పష్టంగా తెలిసిపోతోందని అంటున్నారు నిపుణులు. దాడి సమయంలో సాంకేతిక అంశాలతో సహకరించిన డ్రాగన్ దేశం.. దాడి తర్వాత కూడా తమ మద్ధతు కొనసాగిస్తున్నట్టు కనిపిస్తోంది. పైపెచ్చు నిష్పక్ష పాత విచారణ చేయాలని కోరుకోవడంతో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందన్న మాట వినిపిస్తోంది. ఇరు దేశాలూ సంయమనం పాటించాలంటూ భారత్‌కు నీతులు చెబుతోంది చైనా. దీన్నిబట్టీ చూస్తే డ్రాగన్ కంట్రీ నిజస్వరూపం ఏంటో ఇట్టే చెప్పొచ్చని అంటున్నారు విదేశాంగ నిపుణులు.

చైనా-పాక్ ఫోన్ సంభాషణపై ఇంకా స్పందించని భారత్

అయితే ఈ ఇరు దేశాల మంత్రుల ఫోన్ సంభాషణపై భారత్ ఇంత వరకూ స్పందించలేదు. బ్రిటన్ మంత్రి డేవిడ్ లామీతో మాట్లాడి పహెల్గాం దాడిలో బయట పడ్డ సీమాంతర ఉగ్రవాదం గురించి వివరించారు జైశంకర్. అంతే కాదు తన ఎక్స్ పోస్టు ద్వారా ఉగ్రవాదం పట్ల జీరో టాలరెన్స్ ప్రాధాన్యతను తెలియ చేశారు. పహెల్గాం దాడి తర్వాత కొన్నాళ్లుగా జైశంకర్, మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్, యూకే ప్రధాని కీర్ స్టార్మర్ సహా ఎందరో ప్రపంచ నాయకులతో మాట్లాడారు. వీరంతా భారత్ వైపే ఉంటూ.. సంఘీభావం తెలియ చేశారు.

ఒక్క చైనా మాత్రం పాక్‌పై ఈగ వాలనివ్వమంటోన్న సీన్

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలన్నీ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం పట్ల తమ వైఖరి స్పష్టం చేస్తుంటే.. ఒక్క చైనా మాత్రం.. పాక్ పై ఈగ వాలనియ్యమని అంటోంది. పాకిస్థాన్ ని కూడా దాదాపు తమ సొంత భూభాగం మాదిరిగానే లెక్కిస్తోంది. ఇప్పటికే రష్యా వ్యతిరేక పోరులో భాగస్వాములమైన తాము తీవ్రంగా నష్టపోయామంటోన్న పాకిస్థాన్.. ప్రపంచ వ్యతిరేకతను ఎదుర్కొంటూన్న చైనాతో అంటకాగడం ఎంత వరకూ కరెక్టు? ఈ దిశగా పాకిస్థాన్ ఎందుకు ఆలోచించడం లేదు? పాకిస్థాన్ కి అలాంటి కాంట్ బట్ పొజిషన్ ఎందుకొచ్చినట్టు? ఇది పాకిస్థాన్ కు వరమా శాపమా? అన్నదిపుడు చర్చనీయాంశమైంది.భారత్ పాక్ యుద్ధం ఖాయమైతే.. పాకిస్థాన్ కి సరిపడా ఆయుధ సంపత్తిని అందించడానికి కూడా చైనా సిద్ధమైందా? అంటే అందుకు కూడా అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటికే మన ఆయుధాల్లో డెబ్బై శాతం రష్యా, ఆపై ఫ్రాన్స్ కి సబంధించినవి ఉన్నాయి. రష్యా ఫ్రాన్స్ ఈ దిశగా మనకు మద్ధతు కూడా పలికాయి కూడా. ఇంతే స్థాయిలో చైనా నుంచి పాక్ కి ఆయుధ మద్ధతునందించడానికి చైనా ముందుకు వచ్చిందా? అందుకు తగిన ఆధారాలేంటి?

పాక్‌కి చైనా PL-15 క్షినణులు?

భారత్‌తో సత్సంబంధాలూ చైనాకు అవసరమేభారత్ నంచి రాఫెల్ ముప్పును ఎదుర్కోడానికి పాకిస్థాన్ కి చైనా PL-15 క్షిపణులను ఎక్స్‌ప్రెస్ డెలివరీ చేయడానికి రెడీ. ఇప్పటి వరకూ ఈ వార్త కన్ఫం కాకున్నా.. ఇందుకు ఆస్కారం ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.భారత్ పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్న పరిస్థితుల్లో.. పాకిస్థాన్ వైమానిక దళానికి, చైనా అధునాతన %ూా%-15 మిస్సైళ్లను అందించడానికి అవకాశమున్నట్టు చెబుతున్నాయి కొన్ని నివేదికలు. పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్.. PL-15 కి సంబధించిన చిత్రాలను విడుదల చేసింది. దీన్నిబట్ట చూస్తే పాకిస్థాన్‌కి చైనా ఎంత మేర సాయం చేయడానికి సిద్ధపడిందో చెప్పొచ్చు.

యుద్ధం వస్తే.. బీజింగ్‌టు ఇస్లామాబాద్.. ఆయుధ సరఫరా

భారత్ పాక్ మధ్య యుద్ధం జరిగితే బీజింగ్ టు ఇస్లామాబాద్.. ఆయుధ సరఫరా మరింత వేగంగా సాగేలా తెలుస్తోంది. చైనా అధునాతన మిస్సైళ్లయిన ఇవి.. పాకిస్థాన్ ఎయిర్ ఫోర్స్‌కి ఎంతో ప్రయోజనకరంగా మారే అవకాశముంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానాలను దూరం నుంచే పాకిస్తాన్ విమానాలు




ధీటుగా ఎదుర్కోగలవు. ఈ క్షిపణుల విషయంలో అధికారిక ప్రకటనలు ఇంకా విడుదల కాలేదు కానీ.. ఇందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు తెలుస్తోంది.

పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌కి భారత్.. జీలం జలక్

ఇక సింధూ నదీ జలాల ఒప్పందం రద్దు వ్యవహారం. ఇప్పటికే ఈ అంశంలో భారత్ దూకుడు పెంచినట్టు తెలుస్తోంది. పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌కి జీలం జలక్ ఇచ్చింది. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌కి దగ్గర ఒక్కసారిగా నది వరద పెరిగింది. దీంతో అక్కడ నీటి అత్యయిక పరిస్థితి ప్రకటించారు. ఇది అంతర్జాతీయ నీటి వినియోగ నిబంధనలకు విరుద్ధం అంటుంది పాక్. ఇది శాంపిల్ మాత్రమే అసలు సినిమా ముందు ఉందంటోంది భారత్. ఈ విషయంలో భారత్ పాక్ ని ఇబ్బంది పెడితే.. చైనా నుంచి కూడా భారత్ కి సరిగ్గా ఇలాంటి ఇరకాటమే ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

పాక్‌కి సిందూ నదీ జాలాలు ఎలాంటివో.. భారత్‌కి బ్రహ్మపుత్రా నదీ జలాలు అలాంటివి

పాక్‌కి భారత్ సింధూ జలాల జర్క్ ఇస్తే.. భారత్ కి చైనా నుంచి మరో ముప్పు ముంచుకొచ్చేటట్టు తెలుస్తోంది. అదేంటని చూస్తే బ్రహ్మపుత్రా నది. పాక్ కి సిందూ నదీ జలాలు ఎలాంటివో.. భారత్‌కి బ్రహ్మపుత్రా నదీ జలాలు కూడా సరిగ్గా అలాంటివే. ఈ నది విషయంలో భారత్ చైనా మధ్య ఎలాంటి ఒప్పందాలు లేవు. అయితే భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల అతిపెద్ద నీటి వనరు బ్రహ్మపుత్రా నది. ఈ నది మీద ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఆనకట్టు నిర్మిస్తోంది చైనా. భారత్ ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా డ్రాగన్ కంట్రీ ఎంత మాత్రం పట్టించుకోవడం లేదు. పాక్ మీద భారత్ జల ఖడ్గం ప్రయోగిస్తే.. చైనా సైతం బ్రహ్మపుత్ర అస్త్రం ప్రయోగించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. బ్రహ్మపుత్రా నదిపై సర్వ హక్కులూ తమవేనని చైనా అడ్డుకట్ట వేస్తే.. భారత్ లోని పలు ప్రాంతాలు నీటి కటకట ఎదుర్కునే అవకాశాలు లేక పోలేదు.

చైనా పాక్ దేశాల మధ్య గల ఎకనామిక్ కారిడారే కారణం

చైనా పాకిస్థాన్‌ని అంతగా వెనకేసుకుని రావడానికి గల రీజన్లేంటని చూస్తే.. ఈ రెండు దేశాల మధ్య గల ఎకనామిక్ కారిడార్. గత కొంత కాలం నుంచి చైనా పాకిస్థాన్ మౌలిక సదుపాయాల రంగంలో, ఇంధన రంగంలో అతి పెద్ద పెట్టుబడిదారుగా ఉంటోంది. అందులో CPEC అత్యంత కీలకం. దీని కారణంగా చైనా పాక్ సంబంధాలు ప్రస్తుతం పీక్ స్టేజ్‌కి చేరాయి. అందుకే చైనా భారత్‌ను కట్టడి చేయడానికి వీలైనన్ని ప్రయత్నాలు సాగిస్తూ వస్తోంది. పైకి తాము తటస్థంగా ఉన్నామని చెబుతూనే.. లోలోపల పాకిస్థాన్ కు సహకరిస్తూ వస్తోంది.

భారత్‌తో సత్సంబంధాలూ చైనాకు అవసరమే

అయితే చైనా పాకిస్తాన్‌కి ఎంత మద్ధతు ఇచ్చినా.. భారత దేశంతో సంబంధాలు దెబ్బ తినకుండా చూసుకోవడం కూడా ముఖ్యమే. ఇరు పక్షాలతో సమాన దూరం పాటించాల్సిన అవసరం చైనాకు సో ఇంపార్టెంట్. ఎందుకంటే భారత్ మార్కెట్ చైనాకు చాలా చాలా అవసరం. ఈ దిశగా ఆలోచిస్తే.. చైనా భారత్‌ను తోసి రాజనడానికి లేదని కూడా అంటారు.ఏది ఏమైనా పాకిస్థాన్ కష్టకాలంలో ఉంటే చైనా చూస్తూ ఊరుకోదనడానికి ఇప్పటికే ఎన్నో సాక్ష్యాలు వెలుగులోకి వచ్చాయి. పహెల్గాం దాడిలో ఉగ్రవాదులు చైనా సమాచార సాధనాలను వాడారంటే ఇరు దేశాల మధ్య ఎంతటి సత్సంబంధాలున్నాయో ఊహించుకోవచ్చు. మనం నిషేధించిన యాప్‌లను వాడి సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం వెనక చైనా కుట్ర కూడా ఉందనే భావించాలి. సరిగ్గా అదే సమయంలో తమకేం తెలీదంటూనే.. చాటుమాటుగా ఆయుధాల సరఫరా చేయడానికి కూడా సిద్ధమేన ంటోంది చైనా. వీటన్నిటినీ సునితంగా గమనిస్తూన్న భారత్.. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బాధిత దేశాలన్నిటినీ ఏకం చేస్తోంది. పాక్ వైపు ఒక్క చైనా మాత్రమే ఉంటే.. ప్రపంచ మంతా భారత్ వైపు ఉన్నట్టు కనపిస్తోంది.

# కోలుకోకుండా దెబ్బకొట్టాలి !

న్యూఢిల్లీ,ముల్లును ముల్లుతోనే తీయాలి. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నట్లుగా ఉండాలి. పాక్ ఏర్పడడమే మత ఛాందసవాందతో ఏర్పడింది. తాము భారత్‌ను చీల్చి ఏర్పడ్డామన్న జ్ఞానం వారిలో లేదు. అలాగే భారత్ భిక్షతో దేశంగా ఏర్పడ్డామన్న కృతజ్ఞత బంగ్లాదేశీయులకు లేదు. ఈ రెండు దేశాల్లో మిగిలిన అరకొర హిందువులను తన్ని తరిమేయడం..కశ్మీర్ సహా భారత్‌లో చిచ్చుపెట్టడం వీరి లక్ష్యంగా ఉంది. అది ఎప్పుడో రుజువయ్యింది. మనం శాంతి వచనాలు పలుకుతూ పోతే సమస్య పరిష్కారంకాదు. భారత్‌తో పెట్టుకుంటే అంతే సంగతులు అన్న విధంగా మన జవాబు ఉండాలి. రష్యా ఉక్రెయిన్‌పై దాడిచేసింది. ఇజ్రాయిల్ పాలస్తీనాపై దాడులు చేస్తూనే ఉంది. ఇలాంటి దెబ్బలు మనం కూడా కొట్టగలగాలి. నష్టం కలిగినా ఫర్వాలేదు. దేశాన్ని పటిష్టం చేసే క్రమంలో మనమంతా త్యాగాలకు సిద్ధపడాలి. ఈ దేశాన్ని వందలాది ఏళ్లుగా ఎందరో దాడులు చేసి ధ్వంసం చేశారు. మనలను బానిసలుగా మార్చారు. ఇవన్నీ మనకు గుణపాఠం కావాలి. ఇంకా దాడులను తట్టుకుంటూ పోదాం అన్న పద్ధతి మాత్రం మంచిది కాదు. పహల్గాం దాడి జరిగి వారం రోజులు అవుతోంది. పాక్ నుంచి శిక్షణ పొందిన ముష్కరులే దాడికి కారణమని తేలింది. ముంబై దాడులు కావచ్చు..పుల్వామా దాడి కావచ్చు...పహల్గామ్ కావచ్చు.. అన్నీ పాక్ కుతంత్రాల వల్లనే జరిగిన ఘటనలు. అయినా దాయాది దేశానికి బుద్ధి రావడం లేదు. పహల్గాం దాడిలో పాల్గొన్న నలుగురు ఉగ్రవాదుల్లో ఒకడైన హషీమ్ మూసా పాక్ సైన్యంలో మాజీ పారా కమాండో అని దర్యాప్తులో తేలింది. దీనిని బట్టి పాక్ సైన్యంలో పనిచేసిన వారు ఆ తరవాత ఎలా ఉగ్రవాదులుగా మారుతున్నారో గమనించాలి. ప్రస్తుతం అతడు కరుడుగట్టిన టెర్రరిస్టుగా మారినట్లు దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. పాక్‌కు చెందిన లష్కరే తోయిబాతో కలిసి అతడు పని చేస్తున్నట్లు వెల్లడించాయి. ఆ సంస్థ మాస్టర్ మైండ్లే అతడిని కశ్మీర్‌కు పంపినట్లు- పేర్కొన్నాయి. ఇప్పటికే భారత సైన్యం ఉగ్రవాదులకు అనుకూలంగా పని చేస్తున్నారన్న అనుమానంతో వందల మంది స్థానికులను అదుపులోకి తీసుకొంది. వీరిలో 15 మంది ఉగ్రవాద ఓవర్ గ్రౌండ్ వర్కర్స్, మూసాకు ఉన్న సైనిక నేపథ్యాన్ని ధ్రువీకరించారని అధికారులు వెల్లడించారు. అతడు పాక్ స్పెషల్ సర్వీస్ గ్రూప్ నుంచి లష్కరేలోకి సహాయకారిగా వచ్చినట్లు తెలుస్తోందని సైన్యం ధృవీకరించింది. ఇంతకన్నా ఆధారాలు ఇక అవసరం లేదు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ ఎత్తేసిన తరవాత అక్కడ శాంతి నెలకొనడమే గాకుండా స్థానికులకు ఉపాధి దక్కుతోంది. పర్యాటకం పెరిగింది. అక్కడి యువతలో కూడా మార్పు వచ్చింది. వారంతా జనజీవన స్రవంతిలో కలిసి పోతున్నారు. దీనిని విచ్ఛిన్నం చేసే పన్నాగమే ఉగ్రదాడి అని తేలింది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఘటన అమాన వీయమైనదే కాదు.... మనిషన్నవాడు చేసే పని కాదు. ఇది కేవలం రాక్షస జాతి మాత్రమే చేస్తుంది. పాక్ పెంచి పోషిస్తున్న రాక్షసులు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకుమనం కూడా సన్నద్ధం కావాలి. మరణించిన వారి ఆత్మకు శాంతి జరగాలి. ఉగ్రమూకలను చీల్చి చెండాడం ద్వారా మన సత్తా చాటాలి. అలాగే కాశ్మీర్‌లో ఉంటూ...ఉగ్రమూకలను పెంచి పోషిస్తున్న కొందరు పాక్ సానుభూతిపరులను కూడా గుర్తించి కఠినంగా శిక్షించాలి. వారిని కూడా ఉగ్రదాడులకు బాధ్యులను చేయాలి. భూతల స్వర్గంగా భావిస్తున్న కశ్మీర్‌ను చూడాలని వెళ్లిన పర్యాటకులను హతమార్చిన ఘటనను ఇప్పటికీ భారతీయులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నరమేధాన్ని ప్రపంచ దేశాలు అన్నీ తీవ్రంగా నిరసించాయి. కేంద్ర ప్రభుత్వం ఇందుకు తగిన విధంగానే ప్రతిస్పందించింది. ఈ దుర్ఘటనకు కారణమైన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్‌ఎఫ్)ను, దానికి సహకారం అందించిన లష్కర్ ఎ తోయిబాను, దీనికి వెన్నుదన్నుగా ఉన్నదను కుంటున్న పాకిస్థాన్‌ను లక్షంగా చేసుకొని తక్షణ చర్యలు చేపట్టింది. తక్షణమే రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను రద్దు చేయడం, నీటి ఒప్పందాలను వెనక్కు తీసుకోవడంతోపాటు ఇంకా అనేక చర్యలు చేపట్టింది. సరిహద్దులను మూసివేయడం కూడా వెంటనే అమలు చేశారు.

# అందని ద్రాక్ష కోసం.. బీజేపీ సరికొత్త వ్యూహాలు



హైదరాబాద్,తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని భారతీయ జనతా పార్టీ పట్టుదలతో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటుకుంటామని, అధికారంలోకి వచ్చేస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ సింగిల్ డిజిట్‌కే పరిమితమై చతికల పడింది. లోక్‌సభ ఎన్నికల్లో ఫర్వాలేదు అనిపించుకున్నప్పటికీ.. ఆశించిన లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయింది. ఇకలాభం లేదనుకుంటున్న కాషాయ నేతలు హిందుత్వ ఎజెండానే నమ్ముకుంటున్నారా? ముమ్ముందు రాబోయే ఎన్నికల్లో గెలుపు రుచి చూడాలంటే హిందుత్వ జెండాను బలంగా మోయాల్సిందేనా..?అసలు ప్రజా క్షేత్రంలో బలం పెంచుకోవడంలో కాషాయ పరివార్ ఎక్కడ విఫలమవుతోంది..?

జనజాగరణ పేరుతో ప్రజలకు చేరువవ్వడంపై బీజేపీ ఫోకస్

కమల దళం ప్రజాక్షేత్రంలో పోరు బాటకు రోడ్‌మ్యాప్ రెడీ చేసుకుంటుంది. హిందుత్వ, నాన్ హిందుత్వ ఫార్ములాతో తెలంగాణలో అధికారమనే కుంభస్థలాన్ని కొట్టాలని స్కెచ్ గీస్తోందంట. ఇప్పటికే జనజాగరణ పేరుతో కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి అందిస్తున్న నిధులు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ ఫోకస్ చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లకే పరిమితమై చతికిల పడినప్పటికీ, తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు దక్కించుకున్న కమలం పార్టీలో ఒకింత ధీమా పెరిగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు షాక్ లిచ్చి బీజేపీ ఫుల్ జోష్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే సంస్థాగతంగా పార్టీ బలోపేతం, అధికారం పీఠం కైవసం చేసుకోవడంలో ఎందుకు విఫలమవుతోందనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో నడుస్తోంది

ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలు

తెలంగాణలో సంస్థాగతంగాపార్టీ బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలో అధిష్టాన పెద్దలు ప్రణాళికలకు పదును పెడుతున్నారంట. కానీ రాష్ట్ర నేతల వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుండటంతో అధిష్టానం తలలు పట్టుకుంటుందంటున్నారు. పార్టీలో ఉన్న నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు పార్టీ ఎదుగుదలకు మైనస్ అవుతున్నాయనే టాక్ వినిపిస్తోంది.

జీహెచ్ఎంసీ మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి కసరత్తు

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు జీహెచ్ఎంసీ ఎన్నికలు రాబోతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకొని, నగర మేయర్ పీఠాన్నీ కైవసం చేసుకునేందుకు బీజేపీ పార్టీ కసరత్తులు చేస్తుంది. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో 40కి పైగా సీట్లు సాధించిన బీజేపీ, మజ్లిస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రజలను అకట్టుకునేందుకు జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసి, హైదరాబాద్‌లో ఎంఐఎంను టార్గెట్ చేస్తూ హిందుత్వ ఎజెండాను సమర్ధంగా వినిపించిందని, భవిష్యత్తులో తమకు కావలసిన మైలేజీని పెంచుకుందంటున్నారు. వాస్తవానికి లోకల్ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీకి ఓటర్ల సంఖ్య లేకపోయినా, బరిలో నిలవడం వెనక జీహెచ్ఎంసీ ఎన్నికలే మెయిన్ టార్గెట్ అన్న వాదనలు ఆ పార్టీలోనే వినిపిస్తున్నాయి.

9 నెలల్లో జీహెచ్ఎంసీ కౌన్సిల్ గడువు

లోకల్ బాడీ ఎన్నికలు మరో మూడు, నాలుగు నెలల్లో రాబోతున్నాయనే చర్చ జరుగుతోంది. అంతేకాదు 9 నెలల్లో జీహెచ్ఎంసీ కౌన్సిల్ గడువు కూడా ముగియనుండటంతో బీజేపీ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత బలం పెంచుకోవడానికి వ్యూహాలు పన్నుతోంది. పార్టీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలో వారిని, కార్పొరేటర్లు లేని చోట డివిజన్ స్థాయి నాయకులు కాస్త ముందు నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ ఆదేశించినట్లు కాషాయ శ్రేణులు చెబుతున్నాయి.

జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలు అందుకోవచ్చనే అంచానాల్లో పార్టీ నాయకత్వం

హిందూత్వ ఎజెండాతో జీహెచ్ఎంసీ ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ ఇప్పటికే నిర్ణయించుకుందంట. జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కి ఓట్లు ఉన్నా, కార్పొరేటర్లను, ఎక్స్ అఫిషియో సభ్యులను ఓటింగ్ వెళ్లొద్దని ఆదేశించడం, పోలింగ్ రోజున కనీసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వైపు వెళ్లొద్దని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా మార్చుకోవాలని బీజేపీ భావిస్తోందంట. దానికి తోడు అధికార కాంగ్రెస్ పార్టీ ఎంఐఎంకు మద్దతిచ్చి, తనకున్న 14 ఓట్లను ఎంఐఎం పార్టీ అభ్యర్థికి వేయించి గెలిపించిన తీరును కూడా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనుకున్న లక్ష్యాలు అందుకోవచ్చనే అంచానాల్లో పార్టీ నాయకత్వం ఉన్నట్టుగా తెలుస్తోంది.

ఎన్నికల నాటికి కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్‌లు ఒక్కటే అని ప్రచారం

మొత్తమ్మీద జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్‌లు ఒక్కటే అని ప్రచారం చేసే పనిలో కమలనాథులు పడినట్టు కనిపిస్తున్నారు. ఎన్నికల్లో కూడా దాన్నే ప్రధాన ప్రచారాస్త్రంగా వాడుకుని హిందుత్వ ఎజెండాతో మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలని భావిస్తున్నారంట. మొత్తం మీద రాబోవు ఎన్నికల్లో హిందుత్వ, నాన్ హిందుత్వ ఫార్ములాతో బీజేపీ వేస్తున్న పాచికలు ఎంత వరకు ఫలిస్తాయో?.. అందని ద్రాక్షగా మారిన మేయర్ పీఠాన్ని ఏ మాత్రం కైవసం చేసుకుంటారోచూడాలి.

# నగర పోలీసు కమిషనరేట్ పునః వ్యవస్థీకరణ



హైదరాబాద్,హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పునః వ్యవస్థీకరణలో భాగంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త నిర్ణయాలు, వాటి వివరాలను నగర పోలీస్ కమిషన్ సివి ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ ను 35 సంవత్సరాల తర్వాత పోలీసు పునః వ్యవస్థీకరణ చేయడానికి ఉత్తర్వులు చేసారు. ఈ క్రమంలో పలువురు సిఐలను భారీగా బదిలీ చేశారు. కొత్త ఉత్తర్వుల ప్రకారం రెండు అదనపు లా అండ్ ఆర్డర్ జోన్‌లు (సౌత్ ఈస్ట్,సౌత్ వెస్ట్), 11 కొత్త లా అండ్ ఆర్డర్ డివిజన్‌లు, ఒకటి అదనపు ట్రాఫిక్ జోన్ (ట్రాఫిక్ 3), మరో 11 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 71), 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు (మొత్తం 31) ఏర్పాటు చేసినట్లు- తెలిపారు. అలాగే నగరంలో ఉన్న 7 జోన్‌లకు 7 మహిళా పోలీస్ స్టేషన్‌లతో మహిళా భద్రతా విభాగం, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్, ఐటీ- వింగ్, నార్కోటిక్స్ వింగ్ ఏర్పాటు చేసారు. ఈ మార్పుల కోసం అదనంగా 1200 మంది సిబ్బందిని మంజూరు చేసారు. గత 2 సంవత్సరాలుగా, పోలీసు స్టేషన్ హద్దులపై అలాగే కొత్త పోలీస్ స్టేషన్‌లకు వెళ్లడంలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజల నుండి కొన్ని ఫిర్యాదులు వచ్చాయి. ట్రాఫిక్ పోలీసులకు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు కొన్ని ప్రాంతాలలో అధికార పరిధిపై గందరగోళం ఉండటం, సైబర్ క్రైమ్ వింగ్‌ను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని చర్చించి నివేదించడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మొత్తం హైదారాబాదు సిటీ పోలీసుకు మంజూరైన 17,020 మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పునః కేటాయింపులు మార్పులతో ప్రతి పాదనలు ప్రభుత్వానికి పంపారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆమోదించింది. ఈ మార్పుల వలన రాబోయే పదేళ్ల వరకు హైదరాబాద్ నగర పోలీసులు బాగా పనిచేయటానికి అనుకూలంగా ఉంటుందని సిపి తెలిపారు. హైదరాబాద్ నగర పోలీసు పరిధిలో 72వ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌గా టోలిచౌకి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసారు. ఇంతకు ముందు ఉన్న ఫిల్మ్‌నగర్ పిఎస్, మెహదీపట్నం పిఎస్ , గోల్కొండ పిఎస్ పరిధిలో ఉన్న కొన్ని ప్రాంతాలను ఇప్పుడు కొత్తగా ఏర్పాటు- చేసిన టోలిచౌకి పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చారు. స్థానిక ప్రజలు తొందరగా గుర్తు పట్టడానికి వారికి అనువుగా ఒకటి లా అండ్ ఆర్డర్ డివిజన్ పేరు, మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌లకు స్థానికంగా ప్రసిద్ధి చెందిన అలాగే స్థానిక సూచనలను ప్రతిబింబించేలా పేర్లు మార్చారు. గోల్కొండ డివిజన్‌ను ఇప్పుడు టోలిచౌకి డివిజన్ గాను, సెక్రటేరియట్ పిఎస్‌ను లేక్ పిఎస్‌గా ను, హుమాయున్ నగర్ పిఎస్‌ను మెహదీపట్నం పిఎస్ గాను, షాహినాయత్ గంజ్ పిఎస్‌ను గోషామహల్ పిఎస్‌గా పేరు మార్చారు.లా అండ్ ఆర్డర్ డివిజన్ల ప్రకారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల హద్దులు ఉండాలని ప్రస్తుతము ఉన్న మారేడ్‌పల్లి, బోయిన్‌పల్లి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను తీసేశారు. ఆగాగే ప్రస్తుతం ఉన్న లా ఆండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్ల పరిధి ప్రకారం వాటికి సంబంధించిన ఏరియాల్లో పనిచేయడానికి ట్రాఫిక్ నాంపల్లి పీఎస్, ట్రాఫిక్ అంబర్‌పేట్ పీఎస్, ట్రాఫిక్ లంగర్ హౌస్ పీఎస్, ట్రాఫిక్ బహదూర్‌పుర పీఎస్, ట్రాఫిక్ నల్లకుంట పీఎస్‌ల పేర్లు మార్చి ట్రాఫిక్ గాంధీ నగర్ పీఎస్, ట్రాఫిక్ ఉస్మానియా యూనివర్సిటీ- పీఎస్, ట్రాఫిక్ కుల్సుం పుర పీఎస్, ట్రాఫిక్ ఛత్రినాకా పీఎస్, ట్రాఫిక్ సైదాబాద్ పీఎస్ లుగా పేర్లు మార్చారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏర్పాటు చేసారు. ఇందు కోసం ఒక ఇన్స్పెక్టర్, 8 సిబ్బంది ఏర్పాటు- చేయగా.. జువెనైల్ బ్యూరో యూనిట్ కు - ఒక ఇన్స్పెక్టర్ తో 7 మంది సిబ్బంది ఉంటారు అని తెలిపారు. అలాగే ప్రతి లా అండ్ ఆర్డర్ జోన్‌లో ఒక సైబర్ క్రైమ్ సెల్‌లను ఏర్పాటు- చేసారు. ప్రస్తుత, భవిష్యత్ పోలీసింగ్ అవసరాలకు తగిన విధంగా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు మంజూరైన సిబ్బంది సంఖ్యతో బలోపేతం చేశారు. పునర్వ్యవస్థీకరణలో జరిగిన మార్పులు అధికార పరిధి పటాలు, సంప్రదింపు, పోలీసు స్టేషన్ వివరాలు, పోలీస్ స్టేషన్ స్థానాలు త్వరలో హైదరాబాద్ సిటీ- పోలీస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచబడతాయని ఆనంద్ తెలిపారు.

# కులగణనకు తెలంగాణ రోల్ మోడల్



న్యూఢిల్లీ,కులగణన చేపట్టాలన్న తమ డిమాండ్‌కు కేంద్రం తలొగ్గక తప్పలేదని విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కింపుతో పాటు- కుల గణన చేస్తామని బుధవారం సంచలన ప్రకటన చేసింది. అయితే, ఈ నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. కాంగ్రెస్ ఒత్తిడి మేరకే కేంద్రం తలొగ్గిందని, కుల గణనకు అంగీకరించిందని ఆయన అన్నారు. మేము కుల గణన నిర్వహిస్తామని పార్లమెంట్‌లో చెప్పాము. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని కూడా రద్దు చేస్తామని అన్నాము. నరేంద్రమోడీ కేవలం 4 కులాలు ఉన్నాయని మాత్రమే చెప్పేవారు. ఏం జరిగిందో తెలియదు కానీ, 11 ఏళ్ల తర్వాత కులగణనను ప్రకటించారని అన్నారు. కులగణనపై ఎంత -టైమ్ పడుతుందో కావాలని, దీనిపై మరింత తెలుసుకోవాలని అనుకుంటున్నామని అన్నారు. ఇది మొదటి అడుగు మాత్రమే అని, తెలంగాణ కుల గణన కేంద్ర ప్రభుత్వానికి ఒక నమూనాలా, బ్లూ ప్రింట్‌గా మారవచ్చని ఆయన అన్నారు. కుల గణనకు ఈ ప్రభుత్వానికి మేము మద్దతు ఇస్తున్నామని, కుల గణనకు రెండు ఉదాహరణలు ఒకటి తెలంగాణ, రెండోది బీహార్ అని, ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉందని రాహుల్ చెప్పారు. కుల గణన ద్వారా రిజర్వేషన్లు మాత్రమే కాదని, కొత్త అభివృద్ధి నమూనాను తీసుకురావడమే తమ దృక్పథమని అన్నారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు వారి భాగస్వామ్యం ఎంత అనేది కుల గణన ద్వారా కనుగొనబడుతుందని చెప్పారు. ఆర్టికల్ 15(5) ప్రకారం, ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు ఇప్పటికే చట్టంగా ఉందని, ఎన్డీయే బీజేపీ ప్రభుత్వం దీనిని అమలు చేయాలని రాహుల్ గాంధీ కోరారు. ఉగ్రవాదంపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ కేంద్రాన్ని కోరారు. పెహల్గామ్ దాడికి పాల్పడినవారు సరైన మూల్యం చెల్లించుకోవాలని, ఉగ్రవాదంపై పోరుకు తమ మద్దతు ఉంటు-ందని చెప్పారు. ప్రధాన మంత్రి ఊగిసలాడకూడదని, అరకొర చర్యలు తీసుకోరాదని, పెహల్గామ్ ఉగ్రదాడిలో మరణించిన వారిని అమరవీరులుగా గుర్తించాలని కోరారు. ఈ విషయాన్ని బాధిత కుటు-ంబీకులు తన ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేసినట్లు- వెల్లడించారు.

# పాక్ సైన్యంలో తిరుగుబాటు



న్యూఢిల్లీ,పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధానికి దిగుతుందని పాకిస్థాన్ పాలకులే కాదు.. సైన్యం కూడా భయపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. కొందరు సైనికులు, సైన్యాధికారులు తిరుగుబాటు చేయగా.. పలువురు ఏకంగా ఆర్మీకే గుడ్‌బై చెప్పేశారని 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక తాజాగా కథనం ప్రచురించింది. అన్నిటి కంటే ముఖ్యంగా.. ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతున్నట్లు వెల్లడించింది. ఆయన పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ రావల్పిండిలో బంకర్లో దాక్కుని ఉన్నారని పాక్ ప్రభుత్వంలో కొందరు అధికారులు చెబుతుండగా.. కుటుంబంతో కలిసి విదేశాలకు పరారయ్యారని సోషల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయితే, పాక్ దీన్ని కొట్టిపారేసింది. యుద్ధభయంతో కుటుంబ సభ్యుల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే 4,500 మంది సైనికులు, 250 మంది సైన్యాధికారులు పాక్ సైన్యానికి గుడ్‌బై చెప్పేశారని 'ది డైలీ గార్డియన్' పత్రిక తెలిపింది.ఇంకొన్ని వేల మంది ఉద్యోగాలకు రాజీనామా దరఖాస్తులు సమర్పించారు. దీంతో ఆర్మీ చీఫ్ మునీర్ షాకైనట్లు తెలిసింది. సైన్యంలో ధైర్య స్థైర్యాలు నింపేందుకు ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డీజీ మేజర్ జనరల్ ఫైసల్ మెహమూద్ మాలిక్‌ను రంగంలోకి దించారు. ఆయన అన్ని ర్యాంకుల సాయుధ బలగాలనుద్దేశించి ఏప్రిల్ 26న రాసిన రహస్య లేఖ వెలుగులోకి వచ్చింది. మనోబలం కోల్పోవద్దని.. దేశానికి విశ్వాసపాత్రులుగా ఉండాలని మాలిక్ అందులో కోరారు.

# సనాతనీ హిందూ సార్.. ఏంటిది?



అమరావతి,మొన్న తిరుపతి, నేడు సింహాద్రి.. ఏపీలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలు ఇవి. దేవాలయాల ఆవరణలో భక్తుల ప్రాణాలు పోతున్నాయి! ఇదీ సెల్ఫ్ ప్రొక్లైమ్డ్ సనాతనీ హిందూ పవన్ కల్యాణ్ గారి ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వంలో చోటు చేసుకుంటున్న సంఘటనలు.కాషాయం ధరించి, సనాతనీ హిందూను అని ప్రకటించుకున్నారు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు. అయితే కనీసం ప్రసిద్ధ దేవాలయాల్లో.. ఆయా దేవాలయాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే సమయాల్లో.. కనీస శ్రద్ధ తీసుకోలేనంత స్థితిలో ప్రభుత్వం ఉంది!ఒక సంఘటన నుంచి కూడా మరో సంఘటనకు పాఠాలు నేర్చుకోలేనంతలా ఉంది పాలన! మరి ఈ ఘటనలతో పవన్ కల్యాణ్ కు ఏ సంబంధం అనొచ్చు! ఆయన శాఖ కాదు! అయితే ఆయన ఉప ముఖ్యమంత్రి కదా! ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రి వారంతటి వారు. అందునా సనాతనీ హిందూనంటూ ప్రకటించుకున్న వారు. మరి బాధ్యత వహించరా!ఒకవేళ మరో ప్రభుత్వ హయాంలో ఇలాంటి దుర్ఘటనలు జరిగి ఉంటే.. పవన్ కల్యాణ్ వారి వైరి పక్షంలో ఉండి ఉంటే ఎలా స్పందించేవారు! ఎక్కడో బంగ్లాదేశ్ లో హిందువుల గురించి పవన్ కల్యాణ్ ఆందోళన గొప్పదే! అయితే.. మరి భారతదేశంలో హిందువుల ప్రాణాలు మాత్రం లెక్కలేదా! అది కూడా దైవ దర్శనాలకు వెళ్లిన వారి ప్రాణాలు గాల్లో దీపాల!తెలుగు ప్రజలకు తిరుపతి, సింహాద్రి ఎంతో సెంటిమెట్. అలాంటి చోట్ల ఇలాంటి ఘటనలు జరగడం, పూర్తి నిర్లక్ష్యం, కనీస ఏర్పాట్లు చేయలేకపోవడం, ఒక పద్ధతి, ప్రణాళిక ఏమీ లేకపోవడం.. ఇది వరకూ చరిత్రలో ఇలాంటి ఘటనలు జరగని చోట, ప్రభుత్వానికి, పాలకమండళ్లకు కనీస శ్రద్ధ లేకపోవడమ వల్ల ఇలాంటి ఘటనలు జరగడం శోచనీయం. హిందూమతం ఉద్ధరణ అంటే.. ఇలాంటి ఘటనలకు బాధ్యత వహించడం కూడా! మరి ఇతరులను తిట్టడం కాకుండా, పదే పదే జరుగుతున్న ఇలాంటి ఘటనలకు ఏం సమాధానం చెబుతారు పవన్ కల్యాణ్ గారు!

# ఎండల్లో ఉపాధి కార్మికులు అవస్థ..కూలీలకు కనీస సౌకర్యాలు సున్నా



విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లోనూ ఎండలు తారెత్తిస్తున్నాయి. వడగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. వేసవి తీవ్రత, వడగాల్పులతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇళ్లకే పరిమితమైన ప్రజలు ఇప్పుడు ఎండలతో ఇంటినుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో ఉపాధి హామీ కార్మికులు ఎండలోనే పనులు చేస్తూ శ్రమను స్వేదంగా చిందిస్తున్నారు. వ్యవసాయ కార్మికుల వలసలను నివారించేందుకు వీలుగా ఈ ఏడాది వారికి కనీస పనిదినాలను కల్పించాలన్న లక్ష్యంతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నా ప్రత్యేక వసతులేమీ కల్పించడం లేదు. కూలీల రక్షణ చర్యలు తగిన రీతిలో లేవు. ప్రధానంగా మెడికల్ కిట్లు అందుబాటులో లేవు. ఎవరైనా ప్రమాదానికి గురైనా, వేసవి తీవ్రతకు పడిపోయినా ప్రథమ చికిత్స చేసేందుకు తగిన జాగ్రత్తల్లేవు. పంట కాల్వల పనులు ఎక్కువగా చేయిస్తున్నారు. మళ్లీ ఎండలో వెళ్లి ఎండలో పనులకు రావడం కష్టంగా ఉందని కూడా కూలీలు వాపోతున్నారు. అధికారులు ఇచ్చే కొలతల ప్రకారం పనులు చేయడం కష్టంగా ఉంది. పలుగులతో కాల్వలను తవ్వేందుకు ప్రయత్నించగా చాలా మంది మహిళా కూలీలు చేతులు బొబ్బలు ఎక్కుతున్నాయి. ఎండ తీవ్రతకు పలుగులు కూడా కాలిపోతున్నాయని మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వీటిని పట్టుకుని తవ్వకాలు నిర్వహించలేకపోతున్నామని మహిళా కూలీలు వాపోతున్నారు. మజ్జిగ, మంచినీళ్ల పంపిణీ అంతంత మాత్రంగానే ఉంది. తాగునీటిని కార్మికులు వారి ఇళ్ల నుంచే తీసుకువెళ్తున్నారు. వేతనాలు ప్రతి రెండు వారాలకు ఒకసారి చెల్లించాల్సి ఉండగా ఆరేడు వారాలకు కూడా కొన్ని ప్రాంతాల్లో వేతనాలు రావడం లేదని కార్మికులు చెబుతున్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో విశ్రాంతి కోసం టెంట్లు వేయాలన్న నిబంధనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వడదెబ్బ తగిలి ఉపాధి కూలి మృతి చెందినా కనీస సౌకర్యాల కల్పనలో జిల్లా యంత్రాంగం పట్టించు కోవడం లేదు. ఉపాధి కూలీల రక్షణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

## సమస్యలపై కలిసి చర్చించుకుందాం

హైదరాబాద్,ఆర్టీసీ సమ్మె నోటిసుపై స్పందించిన రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమ్మె నిర్ణయంపై పునరాలోచించాలని అన్నారు. మే 7నుంచి తెలంగాణ ఆర్టీసీ సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తీసుకొచ్చామని.. ప్రస్తుతం సమ్మె చేయాల్సిన పరిస్థితిలో ఆర్టీసీ లేదని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ సమస్యల పరిష్కరానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, ఆర్టీసీ పరిరక్షణ అంశాలపై కట్టుబడి ఉన్నామని అన్నారు. గత పదేళ్ళలో ఆర్టీసీలో పెండింగ్ పీఎఫ్ బకాయిలను తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. సమ్మెపై ఇప్పటివరకు శాఖ మంత్రిగా తనను ఎవరూ కలవలేదని.. డైరెక్ట్ గా లేబర్ కమిషన్ ను కలిసి నోటీ-స్ అందజేశారని అన్నారు.ఉద్యమకారుడిగా తనకు ఆర్టీసీతో ప్రత్యేక అనుబంధం ఉందని.. ఆర్టీసీ కార్మికులతో సమాలోచనలు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు పొన్నం ప్రభాకర్. సమ్మెకు పోవడం వల్ల ఇబ్బందులు వస్తాయని...ఆర్టీసీ రెండు ప్రధాన అంశాలు ముఖ్యమంత్రి నోటీసులో ఉన్నాయని.. వాటిని కూర్చొని మాట్లాడుకుంటామని అన్నారు.

# పహల్గామ్ దాడి...ఉద్రిక్తతలు తగ్గించుకోండి..



వాషింగ్టన్,పెహల్‌గామ్ ఉగ్రదాడితో (పహల్‌గామ్ దాడి) భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. రెండు దేశాల మధ్య నెలకొన్న తాజా పరిస్థితులను ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాలకు అగ్రరాజ్యం అమెరికా (అమెరికా) కీలక సూచన చేసింది. ఉద్రిక్తలను తగ్గించాలని సూచించింది. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో (మార్కో రూబియో) భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైపూర్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేపట్టే ఎలాంటి చర్యలకైనా తమ సహకారం ఉంటుందని జైశంకర్ (ఎస్ జైశంకర్)కు రుబియో హామీ ఇచ్చారు. అదే సమయంలో ఉద్రిక్తతలు తగ్గించుకొని, దక్షిణాసియాలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ఇరు దేశాలు కలిసి పనిచేయాలని సూచించాయి. ఇక పాక్ ప్రధానితో మాట్లాడిన రుబియో.. పెహల్‌గామ్ ఉగ్రదాడిని ఖండించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com